
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 9 ఫిబ్రవరి 2025





కరేడు పంచాయతీ పరిధిలో ఉన్న భూములు

- బీపీసీఎల్ రిఫైనరీ కూడా ఆ ప్రాంతంలోనే?
- విస్తారంగా భూములూ ఉన్నాయ్
- అధికారుల చూపంతా అక్కడే

పారిశ్రామిక ప్రగతి..

కరేడు చుట్టూనే!

కందుకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం ఉలవపాడు మండలం కరేడు వరకు భూసేకరణ ప్రక్రియ జరగనుంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆయిల్ రిఫైనరీ కమ్ పెట్రో కెమికల్స్ భారీ పరిశ్రమను కరేడు పరిధిలోనే ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు అధికార యంత్రాంగం వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో జాతీయ రహదారికి తూర్పున సముద్రతీరం వరకు గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని అన్ని గ్రామాలలో భూమిని ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా సేకరించనున్నట్టు సమాచారం. శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ ఓ. ప్రవీణ్ ఆదిత్యలు కలెక్టరు ఆనంద్, కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజలను వెంటబెట్టుకుని కరేడు పంచాయతీలోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కరేడు మీడియం ఇరిగేషన్ చెరువును, దానికి ఉన్న నీటి పారదుల సౌలభ్యాన్ని విచారించడమేగాక భూముల సమగ్ర డేటాను కలెక్టరును అడిగి తెలుసుకోవటం ద్వారా బీపీసీఎల్ కర్మాగారం ఏర్పాటుకు కరేడు ప్రాంతం అన్ని విధాలా అనుకూలమని ప్రాథమికంగా ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.



కరేడులో భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

3 గ్రామాలు, 5 వేల ఎకరాలు

పోర్టు కోసం గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీలోని భూములను సేకరించగా పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం చేవూరు, రావూరు, ఏలూరుపాడు గ్రామాల పరిధిలో భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఈ మూడు గ్రామాలలో ఇప్పటికే 50 శాతం మేర భూసేకరణ పూర్తవగా రమారమి 5వేల ఎకరాలను సేకరించనున్నారు. ఇప్పటికే చేవూరు సమీపంలో ఇండోసోల్ సోలార్ ప్యానల్స్ పరిశ్రమ రూపుదిద్దుకోగా దానికే 2వేల ఎకరాలకుపైగా భూమి అవసరమని భావిస్తున్నారు. దీంతో ఈ మూడు గ్రామాలను పరిశ్రమల కోసం వదిలేసి బీపీసీఎల్ రిఫైనరీ కోసం రామాయపట్నం, చాకిచర్ల, చాకిచర్ల పెదపట్టపుపాలెం, చిన పట్టపుపాలెం గ్రామాల పరిధిలో 6వేల ఎకరాల భూసేకరణ జరపాలని ఆలోచన చేశారు. అయితే ఆ గ్రామాలకన్నా పోర్టుకు కొద్దిదూరం అయినా కరేడు బీపీసీఎల్ రిఫైనరీకి అనుకూలమని, అక్కడ 12వేల ఎకరాలకుపైగా భూములు ఉండటం, అతిపెద్ద నీటివనరుగా కరేడు మీడియం ఇరిగేషన్ చెరువు ఉండటం సానుకూల పరిణామంగా భావిస్తున్న అధికారులు ఆ దిశగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పోర్టు నుంచి బీపీసీఎల్ కర్మాగారం వరకు పైప్‌లైను ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని కరేడులో భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయవచ్చన్న ఆలోచన కూడా చేస్తున్నట్లు చెబుతున్నారు. కరేడు పరిధిలో మన్నేరు ప్రవహించి వెళ్లి సముద్రంలో కలుస్తుండటం కూడా రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్స్ కర్మాగారం ఏర్పాటుకు అనుకూలాంశంగా భావిస్తున్నట్లు సమాచారం.

కరేడులోనే భూములన్నీ

ఒక్క కరేడు పంచాయతీ పరిధిలోనే 12,632 ఎకరాలు ఉండగా అందులో 2602 ఎకరాల ప్రభుత్వ భూమి, 1200 ఎకరాల అటవీ శాఖ భూమి ఉంది. అంటే బీపీసీఎల్ రిఫైనరీకి అవసరమని భావిస్తున్న భూమిలో 65 శాతం వరకు ఎలాంటి భూసేకరణ చేయకుండానే సేకరించుకునే అవకాశం ఉంది. అలాగే చాకిచర్ల పంచాయతీలోనూ ప్రభుత్వ, ఫారెస్టు భూములు భారీగానే ఉన్నందున వాటిని సేకరించనున్నట్లు సమాచారం. చాకిచర్లలో 6262 ఎకరాలు ఉండగా అందులో ప్రభుత్వ భూమి 1809 ఎకరాలు, ఫారెస్టు భూమి 1498 ఎకరాలు ఉంది. పట్టా 2384 ఎకరాలు మాత్రమే ఉంది. రామాయపట్నంలో 1782 ఎకరాలు భూమి మాత్రమే ఉండగా అందులో పట్టా కేవలం 624 ఎకరాలు మాత్రమే. ఈ గ్రామ పరిధిలో 677 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా 435 ఎకరాల ఫారెస్టు భూమి ఉంది. వీరేపల్లి పరిధిలో 3157 ఎకరాలు ఉన్నా అందులో సగం మాత్రమే జాతీయ రహదారికి తూర్పున ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ గ్రామం పరిధిలో కూడా ప్రభుత్వ భూమి 753 ఎకరాలు, ఫారెస్టు భూమి 660 ఎకరాలు ఉంది. అయితే ఈ గ్రామాలలోనూ భూసేకరణ ప్రక్రియ జరగటం పక్కా అని అయితే బీపీసీఎల్‌కు త్వరితగతిన భూమిని అప్పగించాలంటే కరేడు అనువైనదిగా అంచనాకు వచ్చిన అధికారులు ఆ మేరకు మారిటైమ్ బోర్డు ద్వారా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా ప్రారంభించాలని భావిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



అరచేతిలోనే అన్ని సేవలు

- ఒక్క మెసేజ్‌తో 161 పౌర సేవలు
- వాట్సాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- విభాగాల వారీగా పరిష్కారం

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పౌరసేవల్లో వేగం పెంచేందుకు, పారదర్శకత తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'మన మిత్ర' పేరుతో వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలులోకి తెచ్చింది. మొబైల్ వినియోగిస్తున్నవారిలో నూటికి 90 శాతం మంది వాట్సాప్ వాడుతున్నారు. ఈ యాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత

- మిగతా 6లో

జిల్లాలో రెండు ఫైర్‌స్టేషన్ల భవన నిర్మాణాలకు నిధుల మంజూరు

ఆత్మకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పోలీస్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో రెండు ఫైర్‌స్టేషన్లకు నూతన భవన నిర్మాణాల కోసం నిధులు విడుదలయ్యాయి. ఈ క్రమంలో ఆత్మకూరులోని అగ్నిమాపక కేంద్ర భవనం కోసం రూ.42,01,306, బుచ్చిరెడ్డిపాళెంకు రూ.1,43,94,790 మంజూరయ్యాయి. ఆత్మకూరులో 1983లో నిర్మించిన ఫైర్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో దాని పక్కనే నూతన భవన నిర్మాణానికి 2016లో టెండర్ల ప్రక్రియ జరిగింది. అయితే, పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఆకస్మికంగా మృతి చెందడంతో భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ పనుల గురించి పట్టించుకున్నవారులే లేరు. ఈ క్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.42 లక్షలు విడుదల చేస్తూ టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసే ప్రక్రియ కొనసాగుతుంది. ఆ వెంటనే పనులు ప్రారంభించేందుకు ఆ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.



ఆత్మకూరు : అసంపూర్తిగా నిలిచిపోయిన ఫైర్‌స్టేషన్ భవన నిర్మాణం

కమలనాథుల సంబరాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో శనివారం నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నాయకులు మిఠాయిలు పంచి, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి గట్టి బుద్ధి చెప్పారన్నారు. మరో రాష్ట్ర నేత పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు అవినీతికి గట్టి సమాధానం ఇచ్చి, అభివృద్ధికి పట్టం కడుతూ బీజేపీని గెలిపించారన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో బీజేపీ అన్ని రాష్ట్రాల్లో విజయతీరాలకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కందికట్ల రాజేశ్వరి, రాజేష్, గడ్డం విజయ్‌కుమార్, నరసింహనాయుడు, ఎస్సీ పెంచలయ్య, పరుశురాం, చిలకా ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి)



నెల్లూరులోని బీజేపీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు

విద్యార్థులు మెచ్చేలా 'క్రీడా సామగ్రి'

- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరికరాలు
- ఆన్‌లైన్‌లో పాఠశాలల వివరాలు నమోదు
- స్కూళ్లలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు




నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా స్కూళ్లలో స్థానిక పరిస్థితులు, క్రీడామైదానాలతో పాటు విద్యార్థులకు నచ్చిన క్రీడాంశాల పరికరాలను పంపించి, వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.30వేలు విలువ చేసే క్రీడా పరికరాలు అందించేందుకు అధికారులు వెంటనే సర్వే చేపట్టి, వివరాలను పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో కూడా విద్యార్థులకు ఇష్టమైన క్రీడాంశాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు.

గతంలో నాసిరకం సామగ్రి పంపిణీ

గత వైసీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్రా, సీఎం కప్.. అంటూ నాసిరకం క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి గ్రామాలకు పంపిణీ చేసి, కమీషన్లు దండుకుంటారు. దీంతో గత ఐదేళ్లలో క్రీడారంగానికి చేసిన సేవలు ఏమీలేవు. పాఠశాలల్లో క్రీడా నిర్వహణ కూడా లేకపోవడం, ఉన్నా క్రీడాకారుల వద్ద నుంచి ఫీజుల రూపంలో నగదును వసూలు చేయడం, ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడం.. కారణాలతో పాఠశాలల్లో క్రీడావాతావరణం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువత క్రీడాభివృద్ధిపై దృష్టి సారించింది. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించింది. క్రీడాకోటాను మూడుశాతానికి పెంచింది. తాజాగా పాఠశాలల్లో క్రీడల ఉన్నతి కోసం ప్రత్యేక ప్రణాళికలతో అంచనాలను సిద్ధం చేస్తోంది. పాఠశాలలకు అందించే క్రీడా సామగ్రిలో ఇష్టానుసారంగా అన్నీ పంపించకుండా ఏ పాఠశాలకు ఏమి అవసరమో, స్థానిక విద్యార్థులు ఏ క్రీడాసామగ్రిని కోరుకుంటున్నారో వాటినే అందించాలని నిర్ణయించారు.

పాఠశాల స్థాయిని బట్టి పంపిణీ



జిల్లాలో అన్నీ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలోని ప్రాథమిక పాఠశాలలు 2,043, ప్రాథమికోన్నత పాఠశాలలు 197, ఉన్నత పాఠశాలలు 338, కలిపి మొత్తం 2,602 పాఠశాలల్లో 1.70 లక్షలమందికిపైగా విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో ఒక్కో పాఠశాల స్థాయిని బట్టి పరికరాలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో పాఠశాలకు రూ.7వేలు, ప్రాథమికోన్నత స్థాయిలో రూ.14వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.30వేలు చొప్పున క్రీడా సామగ్రిని అందించనున్నారు. గతంలో దాతల ద్వారా, పాఠశాలల గ్రాంటు ద్వారా మాత్రమే కొంత నగదును వెచ్చించి క్రీడా పరికరాలు కొనుగోలు చేసేవారు. ఈ పరిస్థితిని తప్పించి ఇకపై ప్రతి పాఠశాలకు కూడా విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా క్రీడా సామగ్రి అందించడం శుభ పరిణామమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపామని, త్వరలోనే జిల్లాకు క్రీడా పరికరాలు రానున్నాయని తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.8,28,253

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8,28,253 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ. సాగర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్, కుంకుమార్చన, వివాహాలు, తలనీలాలు, వాహనపూజలు, ప్రత్యేకదర్శనం, విరాళాలు ఇలా పలురకాలుగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.



ఆలయంలో తులసి పూజ నిర్వహిస్తున్న భక్తులు

వేదగిరి క్షేత్రంలో లక్ష తులసి పూజ

నెల్లూరురూరల్, ఫిబ్రవరి8, (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వేదగిరి క్షేత్రంలో భక్తులు లక్ష తులసి పూజ నిర్వహించారు. ముందుగా స్నపన తిరుమంజనం, గీత, వేదపారాయణం, సూర్యనమస్కారాలు అనంతరం ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదిలక్ష్మి అమ్మవార్లకు కుంకుమార్చన, పూర్ణాహుతి, కల్యాణం, అనంతరం గిరిప్రదక్షిణలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఈవో గిరి, ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆధారిత పరిశ్రమలతో కావలి అభివృద్ధి

- యువత వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవాలి
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి

కావలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో కావలి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది కావలి రూపురేఖలే మారనున్నాయని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శనివారం సాయంత్రం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి కలెక్టర్ కావలిలో విస్తృతంగా పర్యటించారు. తొలుత ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఐలవ్ యూ కావలి సెల్ఫీ పాయింట్ వద్ద ఎమ్మెల్యే, ఆర్డీవోలతో కలిసి సెల్ఫీ ఫొటోలు దిగారు. అనంతరం వెంగళరావునగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రూ.1.6 కోట్ల నుడా నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్‌యూబీని పరిశీలించారు. తదుపరి మద్దూరుపాడులోని టిడ్కో గృహాలను పరిశీలించి, స్థానికుల సమస్యలు విని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీల వద్ద ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా బీపీసీఎల్ రిఫైనరీ, ఇండోసోల్, సోలార్ ఎనర్జీ ప్లాంట్ వంటి అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఈ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత స్కిల్ నైపుణ్యాలను మెరుగు పరుచుకుని పోర్టు ఆధారిత పరిశ్రమలలో ఉపాధి పొందాలని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కావలి ప్రాంతంలో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కావలి అభివృద్ధికి నుడా నిధులు కేటాయించటం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధి కోసం ఇంకా నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి ప్రాంత యువత కోసం తన సొంత నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. అలాగే ఇందిరమ్మ కాలనీ వాసుల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఎంహెచ్‌వో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

హాకీలో మహిళలు సత్తా చాటాలి

- ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడలో మహిళలు సత్తాచాటితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్ తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ ఛాంపియన్ షిప్‌పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి మహిళా హాకీ జట్లు పాల్గొనడం శుభపరిణామమన్నారు. హాకీ క్రీడకు ఎంతో చరిత్ర ఉందని, మనదేశ క్రీడాకారులకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. మహిళలు సైతం అంతర్జాతీయ హాకీలో రాణిస్తూ దేశ ప్రతిష్టను ఇనుమడింపచేస్తున్నారన్నారు.ఏపీ హాకీ డైరెక్టర్ ఎస్.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హాకీ క్రీడకు విశేష ఆదరణ ఉందని, మహిళలు పెద్ద ఎత్తున హాకీలో సాధన చేస్తూ రాణిస్తున్నారన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కె.యతిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం వచ్చిందని, ఎన్నో రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణే ఇందుకు నిదర్శనమన్నారు. తొలుత వివిధ జిల్లాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా, అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అతిథులు క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీ హర్షవర్ధన్, రాష్ట్ర పోటీల డైరెక్టర్ థామస్ పీటర్, వెటర్నరీ డాక్టర్ వై.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ తదితరులు

దేశ ఆర్థిక పురోగతికి కాస్ట్ అకౌంట్స్ ఎంతో దోహదం

- కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ జేడీ లక్ష్మీప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): దేశ ఆర్థిక పురోగతికి, ఉత్పత్తి అంచనాలకు కాస్ట్ అకౌంట్స్ ఎంతో దోహదపడతాయని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జేడీ ఐసీఎల్ఎస్ కే లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా, కమిటీ ఫర్ అకౌంటింగ్ టెక్నిషియన్స్, నెల్లూరు చాప్టర్‌లు సంయుక్త ఆధ్వర్యంలో రెండవ జాతీయ క్యాట్ స్టూడెంట్స్ కన్వెన్షన్ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్ ప్రపంచంలో సమ్మతి, నైతిక ఆర్థిక పరిస్థితులు, క్యాట్, సీఎంఏ కోర్సుల ఆవశ్యకతను వివరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ రాజేంద్ర సింగ్ బాటి, కాస్ట్ అకౌంట్స్ విశ్వనాథ్‌భట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు యడపల్లి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ ఫైనాన్స్, అకౌంటింగ్ రంగంలో ఉపాధి, ఉద్యోగాలు పొందాలనుకునేవారికి క్యాట్, సీఎంఏ కోర్సులు ఎంతో ఉపయోగమని తెలిపారు. దేశవ్యాప్తంగా కాస్ట్ అకౌంట్స్ చదివే విద్యార్థులు దక్షిణాదిలోనే అధికంగా ఉన్నారని తెలిపారు. అందులో నెల్లూరు ద్వితీయ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమం లో పాల్గొన్న సీఎంఏ టీసీఏ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ సీఏవీఎస్ ఎస్ మూర్తి, సీఎంఏ వినయరంజన్, సీఎంఏ సురేష్ తదితరులు విద్యార్థులకు క్యాట్, సీఎంఏ కోర్సుల్లో విజయం సాధించేందుకు ఉపయోగపడే మెలకువలను తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. క్యాట్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సదస్సును విజయవంతం చేసిన నెల్లూరు చాప్టర్ చైర్మన్ విశ్వనాథ్‌భట్, వైస్ ప్రెసిడెంట్ యడపల్లి శ్రీనివాసరావును అభినందించారు.



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందచేస్తున్న ప్రముఖులు

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి : ఆర్ఐవో

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన 28వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ లెక్చరర్ కే కుసుమకుమారి మాట్లాడుతూ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థినికి రూ. లక్ష అందచేస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో డికేడబ్ల్యు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, విడవలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దీనదయాళ్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ రెండో ఘాట్‌రోడ్డు జంగిల్ క్లియరెన్స్‌కు చర్యలు

- భూమిపూజ చేసి పనుల ప్రారంభం
- 2.2కిలో మీటర్ల పర్యులకు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టేందుకు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలిస్తారని వారి సౌకర్యార్థం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఘాట్‌రోడ్డు ఇబ్బందులను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించడంతో రూ.20కోట్లతో ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు, ఏఈ మురళి, టీడీపీ మండలాధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, వలేటి మధుసూదన్‌రావు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం కామినేని వీరయ్య, కామినేని అశోక్, కాకుమాను ఆంజనేయులు, కొంకా రమేష్, కాకుమాను మాల్యాద్రి, చిన్నబ్రహ్మయ్య పాల్గొన్నారు.

అరచేతిలోనే అన్ని సేవలు

(5వ పేజీ తరువాయి)

చేరువ కానున్నాయి. 95523 00009 నెంబరును మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబరుతో ఉన్న వాట్సాప్‌ను తెరచి హాయ్ అనే ఆంగ్ల పదాలను టైప్ చేసి పంపితే చాలు 161 పౌరసేవలు అందుబాటులోకి వస్తాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ కొత్త విధానం అమలులోకి రాగా జిల్లా, నగర ప్రజల వినియోగం క్రమంగా పెరుగుతోంది.

● ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 200 నుంచి 400 వరకు ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఏకంగా 14వేలకు పైబడి దరఖాస్తులు అందాయి. వాటిలో ఎక్కువగా గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నవి కాగా, పరిష్కారం కానివి ఎన్నో ఉన్నాయి. సమస్యలు పరిష్కారం కాలేదంటూ కలెక్టరేట్ చుట్టూ పలుమార్లు అర్జీదారులు తిరుగుతూనే ఉన్నారు. మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేసినా ఫలితం ఉండటం లేదు. దీంతో పల్లెవాసులు సైతం కలెక్టరేట్‌కు తరలి వస్తున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వారి సమస్యలను పరిష్కరించకపోగా ఏదో ఒక కొర్రి పెట్టి తిప్పుతుండటం మామూలు అయింది. ఈ సందర్భంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ సేవలు పౌరులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

● వాట్సాప్ సేవలు పొందాలనుకునేవారు 95523 00009 వాట్సాప్ నెంబరుకు మొదట హాయ్ అని సందేశం పంపాలి. అలా పంపితే ప్రధానంగా 8 విభాగాలు సేవలు వస్తాయి. అందులో అవసరమైన దాన్ని ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎంచుకున్న సేవ ఆధారంగా వ్యక్తిగత వివరాలు, ఆధార్ నెంబరు నమోదు చేస్తే సరిపోతుంది. ఇంగ్లీషు, తెలుగు రెండింటిలోనూ సేవలు వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ డబ్ల్యూఎస్ ఎంపిక చేసుకుంటే ఆధార్ నెంబరు ఇతర వివరాలు నమోదు చేయాలి. కాసేపటికి ఆ సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో తెలుపుతూ సందేశం వస్తుంది. ఇలా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాట్సాప్ సేవలను పొందుతున్న ఎందరో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● కొన్ని పత్రాలు ఎప్పుడు అందుబాటులోకి వచ్చేది వాట్సాప్‌లో సమాచారం వస్తుంది. ప్రతి సేవకు నిర్ధేశిత రుసుమును డిజిటల్ విధానంలో చెల్లించాల్సి ఉంటుంది.

● అందుబాటులో ఉన్న సేవలు

ఆర్టీసీ : బస్ టికెట్, బుకింగ్ రద్దుకు ఉపయోగించుకోవచ్చు. దూర ప్రయాణాలు, రిజర్వేషన్ సదుపాయం ఉన్న బస్సుల్లో టికెట్లను సైతం మన మిత్ర ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఏయే ప్రాంతాలకు ఏ సమయాల్లో సర్వీసులు నడుపుతున్నది ఆ వివరాలు కూడా అందులో ఉంటాయి. అలాగే టిక్కెట్‌ను రద్దు కూడా చేసుకోవచ్చు.

రెవెన్యూ : కుల ధ్రువీకరణ పత్రాలు, టైటిల్ డీడ్, పాస్ పుస్తకం వంటి 13 రకాల సేవలు పొందవచ్చు.

విద్యుత్ : విద్యుత్ బిల్లులు చెల్లింపు, సర్వీసు ఇతర సమస్యలను తెలియజేయవచ్చు. విద్యుత్ బిల్లులో సర్వీస్ నెంబరు నమోదు చేస్తే ఆ నెల ఎంత వినియోగించింది తెలుసుకోవచ్చు. ఆ మొత్తాన్ని చెల్లించవచ్చు. కొత్త సర్వీసు కావాలన్నా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్నా ఫిర్యాదులు చేయవచ్చు.

ఎన్టీఆర్ వైద్య సేవ కార్డులు : గతంలో చేసిన ఫిర్యాదులు, దాని ప్రస్తుత స్థితి గురించి తెలుసుకోవచ్చు.

పోలీసు శాఖ : మిస్సింగ్ డాక్యుమెంట్ల ఫిర్యాదులు, పోయిన ధ్రువపత్రాలు గురించి ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం తెలుసుకోవచ్చు.

దేవాలయాలు : ఆలయాల దర్శన టికెట్లను బుక్ చేసుకోవచ్చు. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన దేవాలయాల సేవలను పొందవచ్చు. శ్రీకాళహస్తి, ద్వారకాతిరుమల, అన్నవరం, విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి, సింహాచలం అప్పన్నస్వామి, కాణిపాకం, తదితర దేవాలయాల్లో ఏయే సేవలు జరుగుతాయో తెలుసుకోవచ్చు.

మున్సిపల్ : నగర, పట్టణ పరిధిలోని ప్రజలు కొత్త కొళాయి కనెక్షన్, ట్రేడ్ లైసెన్సులు పొందవచ్చు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం, నీటి చార్జీలు చెల్లించవచ్చు.

న్యూస్ బాక్స్



బంగారు గరుడ వాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు

వైభవంగా భీష్మ ఏకాదశి

● ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు అన్నీ వైష్ణవ ఆలయాల్లో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేషపూజలు జరిగాయి. నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామికి బంగారు గరుడసేవ జరగ్గా, పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

గీతకులాల మద్యం దుకాణాలకు ముగిసిన దరఖాస్తు గడుపు

- 18 షాపులకు 213 దరఖాస్తులు
- రేపు 9 గంటలకు జడ్పీలో లక్కీడ్రా

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గీత కులాల కోసం కేటాయించిన మద్యం దుకాణాలకు శనివారంతో దరఖాస్తుల గడువు ముగిసింది. జిల్లావ్యాప్తంగా 18 వైన్‌షాపులకు 213 దరఖాస్తులు వచ్చాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఒక దుకాణానికి 30 దరఖాస్తులు రాగా, కావలి రూరల్, ఆత్మకూరు రూరల్‌లోని వైన్ షాపులకు మూడు చొప్పున దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.4.26 కోట్లు ఆదాయం వచ్చింది.

● రేపు లాటరీ

దుకాణాల కేటాయింపునకు సోమవారం ఉదయం జడ్పీ కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ డీ శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌కు రావాలని తెలిపారు. ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఎంట్రీ పాస్ తీసుకొని రావాలని, దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చేపడుతారని ఆయన వివరించారు.

సోమశిల డ్యాంలో నీటి నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 1,025 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.133 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటిమట్టం 54.97 టీఎంసీలు

రాపూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి నీటి మట్టం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 53.97 టీఎంసీలుగా ఉన్నదని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య తెలిపారు. ఇందులో సోమశిల ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 965 క్యూసెక్కులు వెళ్తుందని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8183
వెండి కిలో ధర	రూ. 98,300
వెండి ఒక గ్రాము	రూ.101.30

నాణ్యతపై నీళ్లు

● అకాల వర్షాలతో తగ్గిన పొగాకు నాణ్యత ● ఖర్చులు పెరిగి సాగురైతుల కష్టాలు

కలిగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంట అయిన పొగాకును సాగుచేయాలంటేనే రైతులకు కత్తిమీద సాములాంటిది. పొగాకు సాగులో వాతావరణ పరిస్థితులు అత్యంత కీలకం. ఈ ఏడాది పొగాకు నాట్లు వేశాక వాతావరణంలో అనూహ్య మార్పులు రావడం, వీడని వర్షాలతో పొగాకు తోటలు అమాంతం పెరిగిపోయి, ఆకు నాణ్యత తగ్గింది. దీంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది సాగులో 20శాతం మేర ఖర్చులు పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాణ్యత లేని పొగాకు పంట

● అధిక విస్తీర్ణంలో సాగు

ఒక బ్యారన్ గల రైతు పొగాకు బోర్డు నిబంధనల ప్రకారం తొమ్మిది ఎకరాల్లో మాత్రమే పంట సాగుచేయా లి. కానీ ప్రతీ రైతు బోర్డు అనుమతించిన దానికంటే ఎక్కువగా (సుమారు 14ఎకరాలు) సాగు చేశారు. ఈ క్రమంలో ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా పడడంతో తోటల్లో దిగుబడులు పెరిగాయి. తద్వారా రైతు ఆకు క్యూరింగ్ చేయడానికి తనకున్న బ్యారన్ చాలకపోవడంతో మరో బ్యారన్‌లో క్యూరింగ్ చేయాల్సి ఉంది. ఒక విడత మరో బ్యారన్‌లో క్యూరింగ్ చేయాలంటే ఆకు కొట్టుడు, రవాణా, పురికోస, బ్యారన్ అద్దె, కాల్పు కట్టె, డ్రైవర్ కూలి.. ఇలా సుమారు రూ.50వేల వరకు ఖర్చు అయింది. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్‌లో పొగాకు కిలో రూ.310 పలుకుతుంది. కర్ణాటక ధరల కంటే ఏపీలో రూ.50 తగ్గుదల ఉంది. దీనికితోడు ఈ ఏడాది అకాలవర్షాలతో ఆకు నాణ్యత తగ్గిపోవడంతో పాటు అదనంగా పెట్టుబడులు, ఖర్చులు పెరిగిపోవడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

● అడ్డుకున్న గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు గ్రామ శివారు ప్రాంతంలో శనివారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తుం డడాన్ని గ్రామస్థులు అడ్డుకు న్నారు. వివరాలిలా ఉన్నాయి. సమీప ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల ద్వారా గ్రావెల్ తరలింపునకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. దీంతో ఓ ట్రాక్టర్ పరారవ్వగా, మిగిలిన మరో ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను అక్కడే వదిలేయడంతో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



యంత్రంతో ట్రాక్టర్‌లో నింపుతున్న గ్రావెల్

ఆత్మకూరులో ప్రత్యేక నిఘా

స్పెషల్ ఫోర్స్‌తో రోడ్‌మార్చ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఐదుగురు రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించే ప్రాం తాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శని వారం సాయంత్రం ఆత్మకూరులో స్పెషల్ ఫోర్స్‌తో రోడ్‌మార్చ్ నిర్వహించారు. ఆత్మకూరు సీఐ జి గంగాధర్, ఎస్ఐ షేక్ జిలాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పట్టణాన్ని పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి తీసుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని, మంత్రుల కార్యక్రమాలు పూర్తయ్యేంత వరకు పట్టణంలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామన్నారు. ఆర్టీసీ డిపో నుంచి పట్టణంలోకి ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. అదేక్రమంలో ఆత్మకూరు చెరువు ప్రాంతం నుంచి సోమశిల, చేజర్ల వైపు నుంచి వచ్చే వాహనాలు టెక్కే ప్రాంతం మీదుగా పట్టణంలోకి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



రోడ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ గంగాధర్, తదితరులు

నేడు న్యాయ శాఖ మంత్రి రాక

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 9.30గంటలకు ఆత్మకూరుకు చేరుకుని దేవదాయ శాఖ మంత్రి ఆనంతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఆత్మకూరు నుంచి బయలుదేరి నెల్లూరు టీడీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. సాయంత్రం ఐదు గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అవుతారు. తదుపరి సాయంత్రం 6.30గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం అవుతారు.

కుదవ వ్యాపారిని మోసం చేసిన కేసులో

ఇద్దరు నిందితుల అరెస్ట్

సంగం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం తాకట్టు పెట్టి కుదువ వ్యాపారిని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను శనివారం సంగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 5వ తేదీన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి నకిలీ బంగారు గొలుసు తాకట్టు పెట్టి రూ. 12 లక్షలు తీసుకెళ్లారు. అనంతరం అది నకిలీదని గుర్తించిన నిర్వాహకులు అదేరోజు రాత్రి సంగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కాగా, కేసు నమోదు చేసిన ఎస్ఐ రాజేష్ శనివారం ఇద్దరు నిందితులను పాత చెక్‌పోస్టు సెంటర్‌లో అరెస్ట్ చేశారు. ఈమేరకు సీఐ వేమారెడ్డి నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపరిచి వెల్లడించిన వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు, ఏలూరు అజయ్‌కుమార్ అనే ఇద్దరు స్నేహితులు ఈ నేరాలకు పాల్పడ్డారన్నారు. ఇదే తరహా నేరాలు చేసే హైదరాబాదుకు చెందిన రమేష్ వెంకటేశ్వరరావుకు స్నేహితుడు. తనను పోలీసులు పట్టుకుంటుండడంతో నేరాలు చేయడంలేదు. లక్ష రూపాయలు ఇస్తే బీఎస్ఐ హాల్‌మార్క్ వేసిన నకిలీ బంగారు నగలు తయారు చేయిస్తానని చెప్పడంతో కడియాల వెంకటేశ్వరరావు నగదు చెల్లించి 20 చైన్‌లు, 10 బ్రాస్లెట్‌లు, ఇతర కొన్ని ఆభరణాలు తీసుకున్నాడు. వీటితో మూడు జిల్లాల్లోని జడచర్ల, నందికొట్కూరు, బద్వేల్, ఆత్మకూరు, విజయవాడ, అద్దంకి తదితర ప్రాంతాల్లో వాటిని తాకట్టు పెట్టి నేరాలకు పాల్పడ్డాడు. అదేవిధంగా సంగంలో ఓ కుదవ దుకాణంలో నేరానికి పాల్పడడంతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా, నిందితుడు కడియాల వెంకటేశ్వరరావు ఖాతా నుంచి అతని భార్య మౌనిక ఖాతాకు నగదు బదిలీ చేయడం జరిగింది. నిందితుడి వద్దనున్న రూ. 30 వేల నగదుతోపాటు నకిలీ బంగారు చైన్‌లు, బ్రాస్లెట్‌లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ, పోలీసులను అభినందించి రివార్డులకు ప్రతిపాదించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐ, పోలీసులు ఉన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్



ఎండీయూ వాహనం వద్ద క్యూకట్టిన వినియోగదారులు

సరుకుల కోసం బారులు

ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా అవుతున్నా లబ్ధిదారులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. శనివారం ఉదయగిరిలోని బీసీ కాలనీలో ఎండీయూ వాహనం వద్ద సరుకుల కోసం రేషన్‌కార్డుదారులు బారులు తీరారు. పట్టణంలో ఆరు చౌక దుకాణాలకుగాను రెండు వాహనాలే సరుకులు పంపిణీ చేస్తుండడంతో పనులు వదులుకొని ప్రజలు వాహనం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు వాహనంలో సరుకుల నిల్వలు అయిపోతే మరోరోజు నిరీక్షించాల్సి వస్తోందని వినియోగదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి

- జలదంకిలో రూ.10 కోట్ల అంచనాతో పనుల ప్రారంభం
- 52ఎకరాల పరిధిలో ఏర్పాటుకు చర్యలు
- 14ఏళ్లుగా పూర్తికాని నిర్మాణం
- నత్తే నయమనేలా వర్కులు

యాడుంది..

సమ్మర్ స్టోరేజి?



చిట్టడవిని తలపిస్తున్న సమ్మర్ స్టోరేజి ట్యాంకు

జలదంకి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 14ఏళ్ల కిందట మండల ప్రజలకు స్వచ్ఛ జలాలను సరఫరా చేసేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి సమ్మర్‌స్టోరేజి, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా జలదంకిని మోడల్ మండలంగా ఎంపిక చేసి నిర్మాణ పనులకు రూ.10కోట్లు మంజూరు చేసింది. మండలంలోని కావలికాలువ పడమటి వైపున కెయురోడ్డుకు ఆనుకుని చినక్రాక రెవెన్యూ పరిధిలో 52ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను సేకరించి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు మొదలుపెట్టిన గుత్తేదారు మొదట నీటి నిల్వ ట్యాం కునకు సంబంధించి మట్టికట్ట పనులు వేగవంతంగా పూర్తి చేయించారు. తదనంతరం ఓవర్ హెడ్‌ట్యాంకు తదితర సివిల్ పనులు చేయడంలో గుత్తేదారుడు పూర్తిగా వెనుకంజ వేశా రు. బిల్లులు రాక ఏడేళ్ల కిందట పనులు పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగ లేదు. ఎస్ఎస్ ట్యాం కు ప్రాంతంలో కర్ర, తుమ్మ చెట్లు గుట్టలుగా పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది.



నిర్మాణం మధ్యలోనే నిలిపివేసిన ఓవర్‌హెడ్ ట్యాంకు

● శంకుస్థాపనలకు పోటీపడ్డ నేతలు..

ఎస్ఎస్ ట్యాంకు పనుల ప్రారంభంలో నేతలు శిలాఫలకంలో వారి పేర్లు ఉండేలా తాపత్రయ పడ్డారే తప్ప పనులు పూర్తి చేయించి మండల ప్రజల దాహార్తి తీర్చాలన్న తపన ఏమాత్రం కన్పించలేదు. మొదట పార్వతమ్మ ఎమ్మెల్యేగా పనులకు శంకుస్థాపన చేశారు. డీలిమిటేషన్‌లో జలదంకి మండలం ఉదయగిరి అసెంబ్లీకి మారడంతో మేకపాటి సోదరుల పేర్లతో మరో శిలాఫలకం వేయించారు. కానీ పనులు పూర్తి చేయించడంలో ఏమాత్రం చొరవ చూపిన దాఖలాలు లేవు.

● కాకర్ల చొరవ చూపాలి

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవ చూపి నిలిచివున్న సమ్మర్‌స్టోరేజి ట్యాంకు పనులు పూర్తి చేయించి మండల ప్రజల దాహార్తిని తీర్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జలజీవన్ మిషన్‌తో ఈ పథకాన్ని అనుసంధానం చేసి ప్రజలకు స్వచ్ఛజలాలు అందించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

● పీసీసీఎఫ్ ఏకే నాయక్

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్ల సంరక్షణకు అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఏకే నాయక్ పేర్కొన్నారు. అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు రూరల్ మండలం గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సముద్ర జలాలను శుభ్రపరచడంలో తాబేళ్ల పాత్ర ఎంతో కీలమని చెప్పారు. వందల సంవత్సరాలు జీవించే తాబేళ్ల మానవుడి తప్పిదాల కారణంగా మృత్యువాత పడుతున్నాయన్నారు. ముఖ్యంగా మరబోట్ల కారణంగా చనిపోతున్నాయని తెలిపారు. అదేవిధంగా చేపలు కోసం వినియోగించే కొన్ని వలల కారణంగా కూడా అధికంగా మృత్యువాత పడుతున్నాయన్నారు. సముద్రంలో 8 నాటికల్ మైళ్ల అవతల మరబోట్లతో చేపలవేట సాగించాలని చట్టాలు చెబుతున్నా, వాటిని కొంతమంది మత్స్యకారులు పాటించడం లేదని చెప్పారు. వీటిపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలియజేశారు. తాబేళ్ల గుడ్లను కూడా అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న హేచరీలలో 48రోజుల పాటు సంరక్షించి ఆతరువాత పిల్లలను సముద్ర జలాల్లో వదులుతున్నామని వివరించారు. మత్స్యశాఖ, కోస్టుగార్డు, మెరైన్ పోలీసులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా తాబేళ్ల సంరక్షణకు కృషి చేయాలని ఆయన తెలియజేశారు. తాబేళ్ల సంరక్షణకు అవసరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈసమావేశంలో గుంటూరు, తిరుపతి అటవీశాఖ కన్జర్వేటర్లు రాజు, సెల్వంలతోపాటు నెల్లూరు, సూళ్లూరుపేట, ప్రకాశం, బాపట్ల డీఎఫ్‌వోలు మహబూబ్‌బాషా, హారిక, వినోద్, వేమయ్య, నెల్లూరు రేంజ్ ఆఫీసర్ మాల్యాద్రితోపాటు మత్స్యశాఖ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సముద్ర తాబేళ్ల సంరక్షణకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పీసీసీఎఫ్ ఏకే నాయక్ పక్కనే డీఎఫ్‌వోలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్ఐ శివరాకేష్, (ఇన్‌సర్ట్‌లో) రామకృష్ణారెడ్డి(ఫైల్)

మనుబోలు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరు సత్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూనూరు రామ కృష్ణారెడ్డి(60) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... అ ల్లూరు మండలం సింగపేటకు చెందిన రామకృష్ణారెడ్డి భార్య పీ.మైథిలి దొరవారిసత్రం పీహెచ్‌సీలో నర్సుగా పనిచేస్తుంది. దీంతో వారు కొంతకాలంగా సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సింగపేటలో ఉన్న ఇంటిని బాగు చేయించేందుకు ఈనెల 6వ తేదీన రామకృష్ణారెడ్డి స్కూటీపై స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి సూళ్లూరు పేటకు వెళుతుండగా కొండూరు సత్రం సమీపంలో కంటైనర్ వేగంగా వెళుతూ కుడిపక్కన వెళుతున్న స్కూటీకి తగిలింది. దీంతో స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడగా ఆయన తలకు బలమైన గాయమై ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బిట్రగుంట : కావలి ఎక్సైజ్ అధికారులు శనివారం ఏబీ కండ్రికలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనధికారికంగా మద్యం సీసాలున్న గోగుల శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ దేవిక, సిబ్బంది ఉన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

దుప్పట్ల పంపిణీ

కావలి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉప తహసీల్దారు మొగల్ సిరాజ్‌బేగ్ సల్మా దంపతులు శనివారం గిరిజన కాలనీల్లో హ్యాపీ సేవాసంస్థల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సిరాజ్ బేగ్ మనవరాలు రైసా పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష తెలిపారు. కార్యక్రమంలో హ్యాపీ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ గనీబాష, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి,ప్రభయ్య, నౌషాద్ అలీ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ తరగతులు

కావలి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆర్థిక స్వావలంబనతో సమాజాభివృద్ధి సాధ్యమని ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. శనివారం సంయుక్త సేవాసంస్థ సభ్యులు వెంగళరావునగర్ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ తరగతులను ఆర్డీవో ప్రారంభించి నిర్వాహకులు సురేంద్రను అభినందించారు. కార్యక్రమంలో వీవీ సుబ్బారావు, శివప్రసాద్, సంస్థ ఉపాధ్యక్షులు గంధం ప్రసన్నాంజనేయులు, జాఫర్‌ఖాన్, రఘుకుమార్ రెడ్డి, ఖాదర్ బాష పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీ తూమాటి

వలేటివారిపాలెం,ఫిబ్రవరి 8(ఆంధ్ర జ్యోతి):మాలకొండ లక్ష్మీనరసింహస్వా మిని శనివారం ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర పూజలు చేసి శాలువా, పూలమాలతో సత్కరించి ప్రసాదం అందజేశారు.

రేపు రక్తదాన శిబిరం

కందుకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ డోనార్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు శనివారం సక్షమ్ కార్యదర్శి చెన్నా రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియా హాస్పిటల్ బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాల్లో లైన్ వర్క్ పనులతో బృందావనం, మాయాబజారు, రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సా యంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు.

● లింగసముద్రం:పెదపవని మసీదు సెంటర్‌లో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ షేక్ ఫిరోజ్ ప్రకటనలో తెలిపారు.

చౌక దుకాణం తనిఖీ

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):నందిపాడు చౌక ధరల దుకాణాన్ని శనివారం తహసీల్దారు నాగరాజు తనిఖీ చేసి నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. దుకాణం వద్ద సరుకుల వివరాల బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అవకతవ కలకు పాల్పడితే చర్య తప్పదన్నారు.

శివరాత్రి వేడుకలపై సమీక్ష

సీతారామపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):ఘటిక సిద్దేశ్వరంలో 26న నిర్వహించే శివరాత్రి వేడుకపై శనివారం మండల పెద్దలు సమీక్షించారు. అనంతరం దుకాణాల నిర్వహణకు వేలం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ముత్తంశెట్టి చెన్నకేశవులు, ఎడమ తిరుపతయ్య, పిడుగు రమేష్ పాల్గొన్నారు.

నేడు టాలెంట్ టెస్ట్

అనంతసాగరం ఫిబ్రవరి 8(ఆంధ్ర జ్యోతి):స్థానిక టీజేఎన్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జాకీర్ హుస్సేన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

ఉదయగిరి,ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లిలో శనివారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో భారతరత్న జాకీర్‌హుస్సేన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఆవాజ్‌కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సభ్యులు బాలకృష్ణ, అబ్దుల్‌రజాక్, ఖజావలి పాల్గొన్నారు.

కంకర..డస్ట్ వేశారు !

కొండాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొమ్మి పంచాయతీ గండికట్ల చెరువు రామానుజపురం ప్రాంతంలో అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. అందులో భాగంగా కంకర, డస్ట్‌వేసి వదిలేశారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరీక్షను తనిఖీ చేస్తున్న తహసీల్దారు నాగరాజు

ఉదయగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం జవహర్ నవోదయలో 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 124మంది హాజరైనట్లు చీఫ్ సూపరిండెంటెంట్ బాలకేశవులు తెలిపారు.

దుత్తలూరులో..

మండలంలోని నందిపాడు, దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత, ఆదర్శ పాఠశాలల్లో జవహార్ నవోదయలో 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రంను తహసీల్దారు నాగరాజు తనిఖీ చేశారు.

అదిగో ఇస్తాం..ఇదిగో చూస్తాం !

- గోకులం షెడ్ల నిర్మాణాలకు అందని బిల్లులు
- మండలానికి 25మంజూరు
- ప్రారంభంకానివి.. 5
- వాటిలో 15పూర్తి.. 6 షెడ్లు వివిధ దశల్లో..

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):మూగజీవాలకు నీడ కల్పించాలనే సదుద్దేశంతో ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసింది. పశువులు ఎక్కువగా ఉన్న వారు సొంత నిధులతో నిర్మాణాలు పూర్తి చేశారు. నెలలు గడుస్తున్నా పైసా కూడా బిల్లు మంజూరు కాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పనులు పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పిన అధికారులు నేడు నిమ్మకు న్నట్లు వాపోతున్నారు. వారి మాటలు నమ్మి వడ్డీలకు అప్పులు తెచ్చి గోకులం షెడ్లు నిర్మించుకున్నామని ఇపుడు మా పరిస్థితి ఏంటో మాకే అర్థం కావడం లేదంటున్నారు.

● కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు..

21గ్రామ పంచాయతీల్లో 25గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో 14 గోకులం షెడ్లు పూర్తయ్యాయి. వాటిలో 6షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉండగా మిగిలిన 5గోకులం షెడ్లు పనులు ప్రారంభం కాలేదు. పూర్తయిన షెడ్లకు బిల్లులు ఇవ్వకుండా అధికారులు తిప్పుకుంటున్నారని లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి

అధికారుల మాటలు నమ్మి అప్పులు తెచ్చి గోకులం షెడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఇపుడు నెలలు గడుస్తున్నా బిల్లు ఇవ్వడంలో కాలయాప చేసున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

\- కల్లూరి కోటేశ్వరరావు, పోలినేనిపాలెం



పోలినేనిపాలెంలో పూర్తయిన గోకులం షెడ్డు

శ్రీవారికి వైభవంగా గరుడసేవ

కావలి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):హనుమన్ క్షేత్రంలోని లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం భక్తులకు గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో శ్రీవారు శాంతినగర్, కోఆరేటివ్ కాలనీల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఉదయం తోమల సేవ, హోమంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కల్యాణ మహోత్సవం, ఆటోనగర్‌వాసులతో అన్న ప్రసాద వితరణ చేపడతామని అర్చకులు తెలిపారు.

● ఉదయగిరి: దాసరిపల్లి పంచాయతీ వద్ద మూడిపల్లి కోదండరామస్వామి ఆలయంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత అభయరామస్వామి విగ్రహాల ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు.



అలంకరణలో స్వామివారు

వేర్వేరు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఇంటూరి బిజీబిజీ

కందుకూరు: నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఉపాధి నిధులతో నిర్మించనున్న తారురోడ్లకు ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి శంకుస్థాపన చేయనున్నట్లు శనివారం టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. వలేటివారిపాలెం మండలం కళవళ్ల నుంచి లింగసముద్రం మండలం వీఆర్.కోట వరకు రూ.2కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, కళవళ్ల సచివాలయం వద్ద, కందుకూరు మండలం కొండముడుసుపాలెం సచివాలయ కేజీటీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా రూ.70లక్షలతో నిర్మించే బీటీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణం, ఉలవపాడు మండలం కుమ్మరిపాలెం నుంచి కొల్లూరుపాడు వరకు రూ.50లక్షలతో తారురోడ్డు పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

● ఉలవపాడు: ఆత్మకూరు, కరేడులో జరిగిన వివాహ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో నాయకులు పోలుబో యిన శ్రీనివాసులు, అమరనేని వెంకటాద్రి నాయుడు ఉన్నారు. అనంతరం మండల ఆర్యవైశ్య అధ్యక్షుడు బాసనపల్లి సుబ్రహ్మణ్యం కమిటీ సభ్యులతో మాలకొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

● వలేటివారిపాలెం: చుండి మోడల్‌స్కూల్ వార్షికోత్సవ వేడుకలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు శాలువా, మెమొంటోతో సత్కరించారు.



ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవెంకటేశ్వర్, ఎస్ఎంసీ ఛైర్మన్ వసంత్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఆలయ మాజీ ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, వీరయ్య పాల్గొన్నారు.

● లింగసముద్రం: ముత్యాలపాడు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్థులు, ఆలయ పండితులు పూలమాలలు, శాలువాతో సత్కరించి ప్రత్యేక పూజలు చేశారు. నేతలు సుబ్బులు నాయుడు, ఒట్టిగుంట వెంకటరావు, మాజీ సర్పంచు బత్తుల శ్రీనివాసులు, కొండూరి ప్రసాదరావు, సోంపల్లి మనోహర్ పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల పనులు ప్రారంభం



అలంకరిస్తున్న శ్రీవారి ప్రధాన ముఖద్వారం

బిట్రగుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పనులు ఊపందుకున్నాయి.ఉదయం స్వామికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు సత్యనారాయణచార్యులు, ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో గుంజ నాటే కార్యక్రమం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ తూర్పు ముఖద్వారానికి రావికుటుంబ సభ్యులు రంగులు వేయించే పనులు చేపట్టారు. దగదర్తి మండలం చవట పేత్తేడు గిలక శ్రీహరియాదవ్, శ్రీలత దంపతులు అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు స్వామిఅమ్మవర్లను దర్శించుకున్నారు.

రోగ నిర్ధారణపై అవగాహన అవసరం

● జిల్లా వైద్యాధికారి సుజాత



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుజాత

కావలి టౌన్,ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి సుజాత తెలిపారు. శనివారం పట్టణ ఏరియా వైద్యశాలలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో డివిజన్‌పరిధిలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లెప్రసి కేసులపై ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని లక్షణాలుంటే మొదట దశలోనే నయం చేసుకోవచ్చన్నారు. ఎన్ఎంలు, సూపర్‌వైజర్లకు తగు సూచనలివ్వాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతికి తావులేకుండా చూస్తాం

● మురళీధరరావు, ఏపీవో, కొండాపురం



కొండాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. గతంలో ఎలా ఉన్నా నేడు ఆ పరిస్థితి లేదు. సిబ్బందితో పనులు చేయించి గరిష్ట కూలీ అందేలా చ ర్యలు తీసు కుంటాం.

? మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి!

! 19పంచాయతీల్లో 10,914 జాబ్‌కార్డులున్నాయి. నూతన జాబ్‌కార్డులకు ఫారం-1పై అన్ని వివరాలు నమోదు చేసి గ్రామ స్థాయిలో కార్యదర్శితో సంతకం చేయించుకొని ఎంపీడీవో కార్యాలయంలో అందచేస్తే నూతన జాబ్‌కార్డు మంజూరు చేస్తాం.

? పనుల అవినీతిని ఎలా అధిగమిస్తారు!

! గతంలోమాదిరి కాకుండా ప్రతిరోజూ ప నులు జరిగే ప్రదేశానికి వెళ్లి మస్టర్లు, హాజ రయిన కూలీలను పరిశీలిస్తాం. అలాగే వారుచేసిన కొలతలు ఖచ్చితంగా కొలతలు చేపడతాం. ప్రభుత్వం నేడు అందజేస్తున్న కూలీ రూ.300లను పొందేందుకు ఎంత పనిచేయాలో కూలీలకు వివరిస్తాం.

? అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయా.

! అన్ని పంచాయతీలలో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. రోజుకు సగటు న 1500 వందల మంది పనిచేస్తున్నారు.

? మేటీ కింద ఎంతమంది ఉంటారు.

! మేటీకి 50మంది చొప్పున శ్రమశక్తి సంఘాలను నియమిస్తున్నాం. ఇప్పటివరకు 22శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేశాం. 50 మంది ఒకేచోట పనిచేయాల్సి ఉంటుంది.

? సిబ్బంది కొరత ఉందా!

! గుడవళ్లూరు, ఇస్కదామెర్ల, నేకునాం పేట పంచాయతీల్లో క్షేత్రసహాయకులు లేరు. అలాగే గరిమెనపెంట, సత్యవోలు పంచాయతీల క్షేత్ర సహాయకులు గత సామాజిక తనిఖీ బహిరంగా విచారణతో సస్పెన్షన్ అయ్యారు. ముగ్గురు టీఏలు, ఉండగా, ఈసీ సస్పెన్షన్‌లో ఉన్నారు.

మండలాభివృద్ధికి కలసికట్టుగా పనిచేయాలి

● ఎంపీపీ ఆలూరు కొండమ్మ

కావలి రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ ఆలూరు కొండమ్మ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాగునీరు, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, హార్టికల్చర్, అగ్రికల్చర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవోపీఆర్డీ అబ్దుల్ సమద్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల ల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకరావాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. అలాగే గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకుని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ఆముదాలదిన్నె పంచాయతీలో కాలనీల నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులను కోఆప్షన్ సభ్యులు ఖలీల్ కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరగల కవిత, పామంజి రాజయ్య, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పాగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5లక్షల ఆస్తి నష్టం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకర్లవారిపాలెంలో నల్లబోతుల బ్రహ్మయ్య అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ శనివారం దగ్ధం అయ్యింది. ప్రమాదంలో రూ.5లక్షల మేరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. బ్యారన్ క్యూరింగ్ సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడటంతో మంటలు వ్యాపించాయన్నారు. సుమారు 1200 పొగాకు కర్రలు ఉన్నట్లు చెప్పారు. బోర్డు అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు బ్రహ్మయ్య కోరాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన శివయ్య

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని అంజనేయస్వామి ఆలయ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చుండి గ్రామానికి చెందిన శివయ్య తీవ్రంగా గాయాలయ్యాయి. వలేటివారిపాలెం వస్తుండగా అదే సమయంలో కందుకూరు నుంచి పామూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. శివయ్యను 108లో సిబ్బంది కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పైపులైన్ పగిలి నీరంతా వృథా



కొండాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీమవరప్పాడు ఓవర్‌హెడ్ ట్యాంకునకు సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం నుంచి నీరు సరఫరా చేసేందుకు పైపులైను ఏర్పాటు చేశారు. 20రోజుల కిందట స్థానిక చెత్త సంపద తయారీ కేంద్రం సమీపంలో పైప్‌లైన్ పగిలి నీరు వృథా అవుతూనే ఉన్నాయి.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

సీతారామపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన గ్రామ పంచాయతీలోని కస్తూర్బా విద్యాలయం పక్కన ఉన్న ఎస్టీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్టీ కాలనీలోని సవరం వెంగయ్య, భార్య అంజమ్మ ఇటీవల పనుల కోసం బెంగళూరుకి వెళ్లారు. వారి పిల్లలు ముగ్గురు శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరిల్లు, అందులోని వస్తువులు, బట్టలు కాలిపోయాయి. స్థానికులు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో ల క్షా50వేల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని వారి బంధువులు తెలిపారు.

అధ్వానంగా మారిన గ్రామీణరోడ్లు

లింగసముద్రం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. ఈ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై తారు మెటల్ లేచిపోయి గుంతలు పడింది. అన్నెబోయినపల్లి- అంగిరేకులపాడు, విశ్వనాథపురం- వీఆర్.కోట, తిమ్మారెడ్డిపాలెం- గంగపాలెం, ముత్యాలపా డు- ముత్తంవారిపాలెం, కొత్తపేట- రాళ్లపాడు, మొగిలిచెర్ల ఎస్సీ కాలనీ నుంచి దత్తాత్రేయస్వామి గుడి వరకు వెళ్లే రోడ్డు దారుణంగా ఉన్నాయి. ఈ రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కందుకూరు పీఆర్ ఏఈ చంద్రమౌళి మాట్లాడారు. అన్ని లింకురోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు.



దెబ్బతిన్న అన్నెబోయినపల్లి - అంగిరేకులపాడు రోడ్డు

అచ్యుతస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం



లక్ష్మీనారాయణకు చెక్కు అందిస్తున్న లక్కాకుల హైమావతి

కలువాయి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న కలువాయి మండలంకుల్లూరులోని అచ్యుత స్వామి ఆలయానికి లక్కాకుల హైమావతి శనివారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. గ్రామానికి చెందిన అందే చెన్నప్పశెట్టి ట్రస్టు తరఫున ఆమె పెంచలకోన ఆలయం సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణకు చెక్కు అందజేశారు. ఆమె వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలి

● వ్యవసాయ కూలీలు, రైతుల ఆందోళన

ఉదయగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో సాగు, తాగు నీటి కష్టాలు తీర్చాలని సీపీఎం రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం లింగంనేనిపల్లిలో వ్యవసాయ కూలీలు, రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి వరప్రసాదాలైన పెద్దిరెడ్డిపల్లి, సీతారాం సాగర్ జలాశయాలను పూర్తిచేసి శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సాగునీరు లేక భూములు బీళ్లుగా మారాయని, దీంతో ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆయా ప్రాజెక్టులను పూర్తిచేసి మెట్టప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బండగానిపల్లి ఎంపీటీసీ విజయమ్మ పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన

కందుకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, అమ్మవారి మాలమంత్ర హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు లలితాసహస్రనామం ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా నక్షత్ర హోమం, పూర్ణాహుతి కుంభం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకటనరసింహ్మం, అన్నమూరి నరసింహం పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

ఢిల్లీలో విజయంపై బీజేపీ సంబరాలు



ఉదయగిరిలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



కలువాయి: బస్టాండులో స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకుడు పెంచలయ్య

బిట్రగుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ పార్టీ ఘన విజయం సాధించడంతో పార్టీ మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు శనివారం మిఠాయిలు పంపిణీ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. సంతోషకరం అన్నారు. ర్యక్ర మంలో మాజీ మండలాధ్యక్షులు నూక సాని శ్రీనివాసులుయాదవ్, గుర్రం వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పార్టీ మహిళ మండలాధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మీ ఉన్నారు.

● అనంతసాగరం: స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● కావలి: శనివారం సాయంత్రం కావలిలో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. డబ్బులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులోని శివాజీ సెంటర్‌లో బాణ సంచాకల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సీవీసీ సత్యం, మందా కిరణ్, కమల, బ్రహ్మానందం, వెంకటసుబ్బారావు, రంగారెడ్డి పాల్గొన్నారు.

● కలువాయి: స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. సీనియర్ నాయకుడు దండు పెంచలయ్య బస్టాండులో సీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● ఉదయగిరి: శనివారం రాత్రి స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోటపో తుల చెన్నయ్య, బీజేపీ నాయకులు ఆవుల రోశయ్య యాదవ్, చల్లా సుబ్బరత్నం, సయ్యద్ షాజహాన్, శానంపూడి నరసయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం: సంబరాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు



కావలి: శివాజీ సెంటర్ వద్ద సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

న్యూస్ బాక్స్

అన్న క్యాంటీన్‌కి విరాళం

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ నిర్వహణకు విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూవో షేక్.కాశిం రూ.5 వేల విరాళాన్ని శనివారం అందజేశారు. గత ఆగస్టు నుంచి పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు తన పింఛన్ నుంచి విరాళంగా ప్రతి నెలా రూ.5వేలు అందజేస్తున్నారు. జీవితాంతం ఇలానే అందజేస్తానని ఆయన నగర కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు తెలియజేశారు. అందుకు కమిషనర్ కాశింను అభినందించారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

వెంకటాచలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరప్పాడులో ఉన్న పంట పొలాల్లోని 4 వ్యవసాయ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. దీనిపై శనివారం రైతులు వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడాకాన్ని నివారిద్దాం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి, పర్యావరణాన్ని కాపాడుదామని విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఏసీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మూలాపేటలోని ఈఎస్ఆర్ఎం హైస్కూల్‌లో వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. యువజన సర్వీసులశాఖ సీఈవో ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం భవిష్యత్తు తరాలకు ఎంతో ప్రమాదకరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కే మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కూరపాటి శ్యాందన్, మోటివేటర్ టీ వెంకటేశ్వర్లు, యోగిరామ తపోవనం ఆశ్రమం సెక్రటరీ కే కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గొలగమూడిలో భక్తుల రద్దీ

వెంకటాచలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వెంకయ్య స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒక్క రోజే సుమారు 15వేల మందికిపైగా భక్తుల కు అన్నదానం చేశారు. వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయానికి గంట బహూకరణ

మనుబోలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వెలసిఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ ఆలయానికి భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం అంబేడ్కర్ నగర్‌కు చెందిన దాత మోచర్ల మల్లికార్జున రూ.7వేల విలువ చేసే గంటను బహూకరించారు.

టీకాల నమోదుకు ప్రణాళిక

నెల్లూరురూరల్, ఫిబ్రవరి8, (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలు నమోదుకు ప్రణాళికలు తయారు చేయాలని సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్, సూపర్ వైజర్ రామారావు, రసూల్‌బీ పాల్గొన్నారు.

మండల సమావేశం

వెంకటాచలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవో కల్పన ఆధ్వర్యంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాగింది. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. ప్రజా ప్రతినిధులు తమ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ విజేతలకు సత్కారం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : విజయవాడ కృష్ణానదిలో ఈనెల 2న జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో మండలంలోని రేబాలకు చెందిన వృద్ధుడు రమణారెడ్డి, యువకుడు నెల్లూరు రమణారెడ్డిలు టాప్ 10 విజేతలుగా నిలిచారు. వీరిని శుక్రవారం రాత్రి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రేబాల సర్పంచు భాగ్యలక్ష్మి, భర్త మస్తానయ్య, మాజీ ఎంపీటీసీ సుధాకర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

రాంబాబుకు విమర్శించే హక్కు లేదు

వెంకటాచలం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు అంబటి రాంబాబుకు లేదని సర్వేపల్లి జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అబద్దాలు చెప్పుకుని ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

ఆర్థిక సాయం

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నక్కా రమణయ్య అంత్యక్రియలకు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

సంప్రదాయబద్ధంగా సత్యనారాయణ వ్రతాలు

● ఆలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ



స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో సత్యనారాయణ వ్రతం సందర్భంగా అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం నగరంలోని వివిధ ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథుడికి స్నపన తిరుమజనం, విశేష అలంకారం, పూజలు జరిగాయి. రాత్రి గరుడ వాహనసేవ, పేట ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాస రెడ్డి, అర్చకులు, తదితరులు పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం కనుల పండువగా జరిగింది. ఈ వ్రతాన్ని అర్చ కులు శివకుమార్ స్వామి భక్తులతో చే యించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మ న్ కోట గురుబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెం ట్ షేగు షణ్ముఖరావు, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కార్యదర్శి చిరంజీ వి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రెడ్డి, గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనే యులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● పప్పులవీధిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. దాదాపు 70 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మం హనుమాన్ భక్త బృందం ఆధ్వ ర్యంలో జరిగింది. పూజల్లో పాల్గొన్న భక్తులకు వెండి డాలర్లు, అన్నవరం ప్రసాదం, అన్నప్రసా ద వితరణ జరిగాయి.

● నెల్లూరు పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రంగనాయకులపేట సోమిశెట్టి కల్యాణ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నుడా చైర్మన్ మాజీ ముక్కాల ద్వారకానాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పినాకినీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శేషాద్రి సుధీర్, కార్యదర్శి మెంటా శరత్, రీజియన్ చైర్మన్ లీలాధర్‌రెడ్డి, కార్యదర్శి బాలప్రసన్న కుమార్, పేర్ల జనార్దన్‌రావు, దర్శి శరత్ పాల్గొన్నారు.



బుచ్చి కోదండరామస్వామి ఆలయంలో లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా భీష్మ ఏకాదశి పూజలు

బుచ్చిరెడ్డిపాళెం : భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామికి లక్ష తులసి అర్చన అత్యంత వైభంగా జరిగింది. ముందుగా స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు, అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

ప్రత్యర్థితో శభాష్ అనిపించుకున్న జాకీర్ హుస్సేన్

● నుడా చైర్మన్ కోటంరెడ్డి



జాకీర్ హుస్సేన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, డిప్యూటీ మేయర్, టీడీపీ నేతలు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న నేత డాక్టర్ జాకీర్ హుస్సేన్ అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. దివంగత రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని ఆయన విగ్రహానికి డిప్యూటీ మేయర్ తహసిన్‌తో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ ప్రత్యర్థి మహమ్మద్ జిన్నా చేత కూడా శభాష్ అనిపించుకున్న వ్యక్తి జాకీర్ హుస్సేన్ అని అన్నారు. ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జహీర్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు జమీర్, ఇక్బాల్, సుధీర్, సుధాకర్‌రెడ్డి, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

● సీపీఎం నేతల నివాళి

మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ జాకీర్ హుస్సేన్ 138వ జయంతి సందర్భంగా శనివారం సీపీఎం నేతలు ఆయనకు ఘననివాళి అర్పించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న జాకీర్ హుస్సేన్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రియాజ్, ఛాన్‌బాషా, రియాజ్ పాల్గొన్నారు.

● ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): నేటి తరం యువత భారతరత్న జాకీర్‌హుస్సేన్‌ని ఆదర్శంగా తీసుకోవాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రహీద్ తెలిపారు. శనివారం నగరంలోని జాకీర్‌హుస్సేన్ విగ్రహానికి జిల్లా కమిటీ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు షేక్.రియాజ్, షేక్.చాన్‌బాషా, సయ్యద్ రఫూఫ్, నగర కార్యదర్శి షేక్.రియాజ్, ఉస్మాన్, అమాన్, దస్తగిరి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

● జాకీర్ హుస్సేన్ జీవితం ఆదర్శం

నెల్లూరు(హరనాధపురం, ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ జీవితం అందరికీ ఆదర్శమని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు మొహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. నగరంలోని వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి హక్ శనివారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ జనరల్ సెక్రటరీ షేక్.ఆసిఫ్‌పాషా, షేక్.నందాని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్.మొహమ్మద్ హనీఫ్, షేక్.అల్లాబక్షు, షేక్.సుబహానీ, షేక్.షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పెంచలోరి కల్యాణం

రాపూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా దేవేరుల సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో కొలువు తీర్చారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

వియానీ హోమ్‌కు చేయూత

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న వియానీ హోమ్‌కు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక చేయూతనందించారు. వియానీ హోమ్ ప్రతినిధులకు శనివారం చెక్కును అందచేసిన సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే.గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి, సీనియర్ నేతలు బెజవాడ సునీల్‌రెడ్డి, రాఘవేంద్రశెట్టి, రాజారమేష్, డీవీ.సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

గురువుకు ఎన్ఆర్ఐ సన్మానం

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తనకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు పమిడిపాటి పద్మనాభరావు, సత్యవతమ్మ దంపతులను కోడూరుకు చెందిన ఎన్ఆర్ఐ విజయమోహన్‌రెడ్డి సన్మానించారు. శనివారం ఆయన చెన్నపల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సాయి కుమార్, గణిత ఉపాధ్యాయుడు వి.మోహన్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు పణికుమార్‌తో కలిసి విశ్రాంత ఉపాధ్యాయుల నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి : పట్టాభిరామిరెడ్డి



గండవరంలో రోడ్డు విస్తరణకు తొలగిస్తున్న వైఎస్సార్ విగ్రహం

కొడవలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి టీడీపీతో సాధ్యమని రాష్ట్ర పౌర, సరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలో గండవరంలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు రాష్ట్రంలోని మారుమూల గ్రామాలను ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. అందులో భాగంగా గండవరంలో రోడ్డు విస్తరణ జరగనుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు ఏ.మాలకొండయ్య, తదితరులున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ పని నిమిత్తం మోటర్ బైక్‌పై పోర్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా పుంజులూరుపాడు రైల్వే గేటు దాటిన తర్వాత పోర్టు రోడ్డుపై ఒక్కసారిగా గేదెలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లికార్జున్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న నగర డీఎస్పీ

● గర్భిణి కుటుంబానికి ఆర్థిక చేయూత



ఖర్చులకు నగదు అందిస్తున్న సంతపేట మహిళా కానిస్టేబుల్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు నేనున్నానంటూ నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ ఓ గర్భిణీ కుటుంబానికి అండగా నిలించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకి చెందిన ఓ కుటుంబం తిరుపతి నుంచి సొంతూరుకి రైలులో వెళ్తున్నారు.నెల్లూరు దగ్గరకు రైలు వచ్చేసరికి ఆమెకు అత్యవసర వైద్యం అందించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆమె కుటుంబసభ్యులు నెల్లూరులో రైలు దిగి చికిత్స నిమిత్తం ఆమెను జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పూర్తయ్యాక తిరిగి సొంతూరుకి వెళ్లేందుకు చార్జీలకు కూడా వారివద్ద నగదు లేదు. దీంతో నగర డీఎస్పీకి ఫోన్ చేసి వారి పరిస్థితిని వివరించారు. స్పందించిన నగర డీఎస్పీ సింధుప్రియ సంతపేట పోలీసులను ఆ కుటుంబం వద్దకు పంపి, వారికి భోజనం, రైలు టికెట్లు, ఖర్చులకు అవసరమైన నగదు అందజేశారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

కుంభమేళాకు కదిలిన ఆర్టీసీ బస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మహా కుంభమేళాకు నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి సూపర్‌లగ్జరీ బస్సు శనివారం మధ్యాహ్నం కదిలింది. ఆర్టీసీ నెల్లూరు వన్ డిపో మేనేజర్ మురళీకృష్ణ బస్సును ప్రారంభించారు. నెల్లూరు నుంచి మహాకుంభమేళా, కాశీయాత్ర ముగించుకొని ఈ బస్సు ఈనెల 15న రాత్రి నెల్లూరుకి చేరుకుంటుంది.

సాహిత్య కళాఖండం 'దీపిక'



దీపిక గ్రంథంపై సమీక్ష చేస్తున్న డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర సాహిత్య అవార్డు పొందిన 'దీపిక' గ్రంథం సాహిత్య కళాఖండమని అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య తెలిపారు. శనివారం నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో గల శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన దీపిక గ్రంథం సమీక్ష, విమర్శల చర్చా వేదిక జరిగింది. ఈ కార్యక్రమంలో దీపిక గ్రంథంలోని 36 వ్యాసాలను డాక్టర్ టేకుమళ్ల సమీక్షించారు. అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ దీపికలోని వ్యాసాలు, ఒకే తరం సామాజిక సాంస్కృతిక వాతావరణాన్ని, ప్రతిబింబిస్తుందని తెలిపారు. చర్చా వేదికను అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ ప్రారంభించారు. అరసం జిల్లా కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు, పెనుగొండ రాసిన దీపిక గ్రంథంలోని గుర్రం జాషువా వ్యాసంలో వాడిన పదునైన వాక్య నిర్మాణ సౌందర్యాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ కవులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో మండలంలోని కొత్తూరులో ఆపార్టీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీట్లు పంచి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేవూరు వెంకట్రావు, సీహెచ్.గాంధీ, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, అతిపాటి శరత్, దొంతాల మహేష్, నెల్లూరు శ్రీనివాసులు, నెల్లూరు వెంకటశేషయ్య, లేబూరు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : బీజేపీకి ఘన విజయం అందించిన ఢిల్లీ ప్రజలకు ఆపార్టీ బుచ్చి రూరల్ మండల అధ్యక్షుడు సిద్ధన మనోహర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈవీఎం ట్యాపరింగ్‌తో గెలిచారంటూ కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడడం సబబుకాదన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయం నుంచి పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘురామయ్య, కృష్ణారెడ్డి, నాగమణి, పెంచలప్రసాద్, రాఘవరెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంతియాజ్ బాధ్యతల స్వీకారం

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చీఫ్ జనరల్ సెక్రటరీగా షేక్.ఇంతియాజ్ శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం నగరంలోని బట్వాడీపాలెం సెంటర్‌లో ఉన్న ఏఎఫ్ఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఆయన చేత కమిషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎండీ .ముజాహిద్, చైర్మన్ డాక్టర్ షరాష్ ఫోబి రమాన్, జాతీయ ప్రిన్సిపల్ కార్యదర్శి రోహిత్ పాండే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ తాను ఇప్పటివరకు చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించిందన్నారు. ఈ పదవికి వన్నె తెచ్చేలా సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్.సుహాయి ల్, డాక్టర్ జీ.ప్రశాంతి, డాక్టర్ మౌలానా షరీఫ్ హుసేనీ, జే.సుమలత పాల్గొన్నారు.

హ్యాట్రిక్ గెలుపుతో మరింత బాధ్యత పెరిగింది

● గడప గడప కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



రైతుకూలీ కుటుంబ మహిళతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి8, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు తన సోదరుడు శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. గడప గడప కార్యక్రమం శనివారం 28వ రోజుకు చేరడంతో మండలంలోని దొంతాలి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, రైతుకూలీ కుటుంబాలతో మాట్లాడారు. తాము ఇంట్లో గడిపే సమయంకంటే ప్రజల మధ్య ఉండే సమయమే ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వైసీపీలోని టెంకాయల బ్యాచ్‌లాగా, తాము శంకుస్థాపనలు చేసి వదిలేసేవాళ్లం కాదని, పనులు మొదలు పెట్టేటప్పుడే పూర్తిచేసే గడువు కూడా ప్రకటిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రాజకీయాలకతీతంగా 'కోవూరు' అభివృద్ధి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని పాటూరులో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.20.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించిన ఆమె నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చేదిశగా కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. అర్హులైన ప్రతి పేద వారికి ఎస్సీ, ఎస్టీ, ఓసీ, బీసీ, కార్పొరేషన్ల ద్వారా రుణాలు, పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో పాటూరులో సుమారు రూ.76.32 లక్షలతో మినీ చేనేత క్లస్టర్‌ని ఏర్పాటు చేయనున్నామన్నారు. తద్వారా చేనేత కార్మికుల ఆర్థిక ప్రయోజనం మెరుగువుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మల పార్వతి, తహసీల్దారు నిర్మలానందబాబా, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, టీడీపీ నాయకులు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, ఆదాల శివారెడ్డి, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో తాగునీటికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చర్యలు చేపట్టింది. పెద్దాసుపత్రిలో 'దాహం తీర్చే దిక్కేది' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి లో శనివారం ప్రచురితమైన కథ నంపై కమిటీ స్పందించింది. ప్ర సూతి, చిన్నపిల్లల విభాగంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇక్కడే రూ రల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన మరో ఆర్వోప్లాంట్ మరమ్మతులకు గురికాగా, ఎంత ఖర్చు అవుతుందో అంచనా తయారు చేయాల ని కమిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యులు మొగరాల సురేష్ టెక్నీషియన్‌ను కోరారు. ఆసు పత్రి సూపర్‌వైజర్‌లతో కలిసి వివిధ విభాగాల ఆర్వోప్లాంట్లను కూడా వారు పరిశీలించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ కూడా ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. అలాగే జనరల్, సర్జికల్, ఎముకలు, కీళ్ల విభాగాలు, కంటి విభాగం, ఈఎన్‌టీ వార్డుల వద్ద దాతలు వాటర్ కూలింగ్ పరికరాలను ఏర్పాటు చేశారు. అయితే వీటికి కూడా నీటి సరఫరా లేక పోవటంతో కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్కడున్న ఆర్వోప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలని, అందుకయ్యే ఖర్చు తాము భరిస్తామని వెల్లడించారు. వేసవిలో రోగులకు తాగునీరు అందించాలని పేర్కొన్నారు.

బీసీలకు 34 శాతం అభినందనీయం : సురేష్‌బాబు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినే టెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేయటం అభి నందనీయమని టీడీపీ బీసీసెల్ నగర అధ్యక్షుడు సురేష్‌బాబు తె లిపారు. టీడీపీ జిల్లా కార్యాల యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వటంపై సీఎం చంద్రబాబు నాయుడకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత దివంగత సీఎం ఎన్టీఆర్‌కి దక్కగా, స్థానిక సం స్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది చంద్రబాబేనన్నారు. బీసీలకు 34 శాతం నామినేటెడ్ పదవులు ఇస్తామని మంత్రి నారాలోకేష్ హామీ ఇచ్చారని, అందుకు అనుగుణంగా ఈ తీర్మానం చేయటం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

తోటపల్లిగూడూరు : రాష్ట్రం లో బీసీల అభ్యున్నతికి కృషి చేసి 34 శాతం రిజర్వేషన్లు అందించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర పేర్కొన్నారు. శనివారం తోటపల్లి గూడూరులో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు ఏ ప్రభుత్వంలో రిజ ర్వేషన్లు పెంచలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు అన్యాయం జరుగుతుందని అధికారంలోకి వచ్చిన తరువాత 24 శాతం ఉన్న రిజర్వేషన్లును 34శాతం పెంచి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొదలకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేదురుపల్లిలో గత పది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వరి పైరు ఎండిపోతోంది. దీనిపై శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఇది పనిచేసేది ఎప్పుడు.?' నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్ అంటూ ప్రచురి తమైన కథనానికి పొదలకూరు విద్యుత్ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం స్పందించారు. ఆయన ఆదేశాలతో విరువూరు ఏఈ సుజాత ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింద అనధికారికంగా ఉన్న విద్యుత్ మోటార్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆమె రైతులకు సూచిం చారు. అలా చేయని క్రమంలో తమ సిబ్బంది ద్వారా అనధికార మోటార్లను తొలగి స్తామని హెచ్చరించారు. విద్యుత్ లోడ్ అధికం కాకుండా ఉండాలంటే అనధికారికంగా మోటా ర్లు నిర్వహిస్తున్న రైతులు మరొక ట్రాన్స్‌ఫార్మర్ కొరకు చలానా కట్టి దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా వీలైనంత త్వరగా ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

శాస్త్రోక్తంగా భీష్మ ఏకాదశి వేడుకలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లు, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో అభిషేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. సంప్రదాయం ప్రకారం విజ్ఞానగిరి వద్ద కొంతసేపు ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పూజల అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు ←




తిరుపతిలో మీనాక్షి

ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి శనివారం తిరుపతి వచ్చారు. నగరంలో ఓ షోరూమును ప్రారంభించిన ఆమె అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పాటలకు స్టెప్స్ వేస్తూ యువకుల్లో ఉత్సాహం నింపారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. హీరో నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తొలి సినిమాలో హీరోయిన్‌గా మిమ్మల్ని అనుకుంటున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందనగా తనకు ఈ విషయం తెలియదని, అవకాశం వస్తే తప్పక నటిస్తానన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ మేయర్ ఎన్నిక తిరుపతిలో రాజకీయ సమీకరణలను తారుమారు చేసింది.అధికారంలోకి వచ్చినా గతంలో వేధించిన వైసీపీ నాయకులను ఏమీ చేయలేకపోతున్నామని నిర్వేదంలో వున్న టీడీపీ శ్రేణుల అసంతృప్తిని ఈ ఎన్నిక దాదాపుగా పోగొట్టేసింది. అదే సమయంలో తిరుపతి టీడీపీలో నాయకత్వ కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది. నూతన నాయకత్వాన్ని అందించడానికి ఇదే సరైన తరుణమన్న భావన శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీ శ్రేణుల్లో తగ్గిన అసంతృప్తి

- డిప్యూటీ మేయర్ ఎన్నికతో తిరుపతిలో బలం, పట్టు నిరూపించుకున్న పార్టీ
- నేతల లొంగుబాటుతో ఆందోళనలో వైసీపీ శ్రేణులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణులు అష్టకష్టాలు పడ్డాయి. చురుగ్గా పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఎవరి పరిధిలో వారు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. చాలా మంది వ్యాపారాలు, బతుకుదెరువు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోయారు. మరికొందరు భౌతికంగా దాడులకు గురయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే గతంలో ఇబ్బంది పెట్టిన వారిని, అక్రమాలకు పాల్పడిన వారిని తాము కూడా ముప్పుతిప్పలు పెట్టాలని టీడీపీ శ్రేణులు ఉవ్విళ్లూరాయి. ఆరు నెలలు గడిచినా అలాంటిదేమీ జరగకపోగా కక్షసాధింపు చర్యలు వద్దని అధినేత చంద్రబాబు కట్టుబాటు విధించారు. దీంతో పార్టీ శ్రేణులు తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయాయి. స్థానికంగా నాయకత్వం లేకపోవడం, నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో పాటు కొత్తగా ఈ కట్టుబాట్లతో శ్రేణులు చప్పబడిపోయాయి. అలాంటి స్థితిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక రావడం, ఒక కార్పొరేటర్ మాత్రమే ఉన్న టీడీపీ 25మంది వైసీపీ కార్పొరేటర్లను తనవైపు తిప్పుకుని గెలుపొందడం పార్టీ శ్రేణులకు ఊపిరి పోసినట్టయింది. ద్వితీయ శ్రేణి నాయకులు రంగంలోకి దిగి చురుగ్గా పనిచేసి ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేయడం కార్యకర్తల్లో స్థైర్యం నింపింది. వైసీపీ నాయకులను దీటుగా ఎదుర్కోగలమనే ధైర్యం కల్పించింది. గతంలో వైసీపీ నాయకుల దూకుడుకు, అక్రమాలకు సరైన సమాధానం చెప్పామన్న తృప్తి ఇపుడు శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

అనివార్యంగా బలపడిన జనసేన, బీజేపీ

టీడీపీతో పోలిస్తే తిరుపతిలో జనసేన, బీజేపీ బలం తక్కువ. దానికి తగ్గట్టుగానే డిప్యూటీ మేయర్ ఎన్నిక వ్యవహారంలో ఈ రెండు పార్టీలూ జోక్యం చేసుకోలేదు. జనసేన పార్టీ నాయకులు కొంతమేరకు పరోక్షంగా సహకారం అందించినా ప్రత్యక్షంగా మాత్రం రంగంలోకి దిగలేదు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడా ఎంత పాత్ర పోషించాలో అంతవరకే పరిమితమయ్యారు. ఇక బీజేపీ నేతలు పూర్తి దూరం పాటించారు. అయినా డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ గెలుపొందడంతో ఆ మేరకు కూటమిలో భాగంగా జనసేన, బీజేపీ కూడా తిరుపతిలో బలపడినట్టయింది.

తాజా ఎన్నికతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన

తిరుపతిలో వైసీపీ సంస్థాగతంగా చాలా బలంగా ఉందన్న అభిప్రాయం మొన్నటి దాకా అందరిలో ఉండేది. నియోజకవర్గ నాయకత్వంతో పాటు డివిజన్ స్థాయిలో కూడా బలమైన నాయకులు ఉన్నారని రాజకీయ వర్గాలతో పాటు సామాన్య జనం కూడా భావించేవారు. డిప్యూటీ మేయర్ ఎన్నికతో అలాంటి అంచనాలన్నీ తలకిందులయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో దూకుడుగా వెళ్లి దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడిన నాయకులపై ఈ ఎన్నికల్లో టీడీపీ నేతలు దృష్టి పెట్టడంతో దాదాపు అందరూ లొంగుబాటు ప్రకటించినంత పనిచేశారు. కొందరు ఎన్నికకు ముందే శిబిరం మార్చేయగా మరికొందరు చివరి క్షణంలో ప్లేటు ఫిరాయించారు. కొందరు తటస్థంగా ఉండిపోయారు. దీంతో 48మంది కార్పొరేటర్లున్న వైసీపీ బలం ఎన్నిక సమయానికి 21కి పడిపోయి పరాజయం పాలైంది. కూటమికి కిందిస్థాయి నాయకులు లొంగిపోయిన తీరుతో వైసీపీ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయి. ఎవరిని నమ్ముకుని వచ్చే నాలుగున్నరేళ్ల పాటు వైసీపీలో కొనసాగాలన్న ఆలోచన వారిలో ఆందోళన కలిగిస్తోంది. ఇంతకాలం తిరుపతిలో వైసీపీ బలంగా ఉందని భావించిన వారు తాజా ఎన్నిక పరిణామాలతో అదంతా బలం కాదని అధికారాన్ని అడ్డుపెట్టుకోవడంతో బలంగా కనిపించిన వాపు మాత్రమేనన్న అభిప్రాయానికి వస్తున్నారు.

టీడీపీలో నూతన నాయకత్వానికి ఇదే తరుణం

తిరుపతిలో ఆవిర్భావం నుంచీ టీడీపీ బలంగా ఉంది. లేనిదల్లా బలమైన నాయకత్వం మాత్రమే. గతంలో కాంగ్రెస్, తర్వాత వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసినా తట్టుకుని నిలబడ్డారే తప్ప భయపడి పార్టీ మారిన ఆనవాళ్లు పెద్దగా లేవు. అందుకే నాయకత్వం బలంగా లేకున్నా ఇంత కాలం పాటు పార్టీ నిలదొక్కుకుంది. నిజానికి 2019లో పార్టీ అభ్యర్థి ఓటమి చెందడం, ఐదేళ్లు వైసీపీ అక్రమాలను బలంగా ఎదుర్కోలేకపోవడం, కిందటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి టికెట్ దక్కకపోవడం వంటి వరుస పరిమాణాలతో తిరుపతిలో టీడీపీ బలహీనపడిందన్న అభిప్రాయం వ్యాపించింది.అయితే డిప్యూటీ మేయర్ ఎన్నికతో పార్టీ బలం ఏమాత్రం తగ్గలేదని నిరూపితమైంది.కాకుంటే ఇప్పటికీ పార్టీని నాయకత్వ కొరత వేధిస్తోంది. వాస్తవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తిరుపతిలోనే మకాం వేసి తెరవెనుక వ్యూహ రచన చేసి దాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వల్లే డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి గెలిచారు. ఎన్నికలకు నాలుగున్నరేళ్ల వ్యవధి ఉన్నందున ఇప్పుడే తిరుపతి టీడీపీలో కొత్త తరాన్నినూతన నాయకత్వాన్ని తయారు చేయాల్సిన తక్షణావసరముంది. ఆ దిశగా అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముంది.

హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌కు బాంబు బెదిరింపు

హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌లో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

- చెన్నై నుంచి మెయిల్
- ఉలిక్కిపడ్డ పర్యాటకులు
- అంతా ఉత్తిదే అని తేల్చిన పోలీసులు



తిరుచానూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద ఉన్న హోటల్ గ్రాండ్ రిడ్జ్‌కు శనివారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. హోటల్ నిర్వాహకులతో పాటు బస చేసిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు తనిఖీలు చేసి, ఫేక్‌కాల్‌గా నిర్ధారించారు. అచ్చి ముత్తు సవుక్కు శంకర్ అనే మెయిల్ ఐడీ నుంచి 'మీ హోటల్‌లో ఆర్‌డీఎక్స్‌తో కూడిన బాంబును అమర్చి పేల్చివేస్తాం' అని శనివారం వేకువజామున 2 గంటలకు మెయిల్ వచ్చింది. హోటల్ సిబ్బంది మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో గుర్తించారు. సాయంత్రం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తనిఖీలు చేశారు. చివరకు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ఈ ఘటనతో తిరుచానూరులో కలకలం రేగింది.

పెలికాన్ పక్షి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఫారెస్టు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఉల్లాపడవ చెరువులో పెలికాన్ పక్షి మృతి చెందింది. ఎప్పుడో మృతి చెందిన పక్షి కళేబరం శనివారం బయటపడింది. స్థానికులు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని పక్షి కళేబరాన్ని వెలికితీశారు. వారం రోజుల ముందు మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు. పోస్టుమార్టానికి పంపి మృతికి గల కారణాలు తెలుసుకుంటామన్నారు.



మృతి చెందిన పెలికాన్ పక్షి

రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న జరుగనున్న రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం తిరుమలోని గోకులం మీటింగ్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాత్రికుల కోసం రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రత, అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సదుపాయాలపైనా సమీక్షించారు. 12వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని, వృద్ధులను, పదేళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

15 మంది పోటు కార్మికులకు సూపర్‌వైజర్ల హోదా

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీలో సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం 15 మంది సీనియర్ పోటు కార్మికులకు సూపర్‌వైజర్ హోదా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరగడంతో లడ్డూ ప్రసాదానికీ డిమాండ్ అధికమైంది. దీనికి అనుగుణంగా ఎప్పటికప్పుడు పోటు కార్మికులను టీటీడీ నియమించుకుంటూ వస్తోంది. ఎఫ్‌ఎస్‌ఎస్ఏఐ నిబంధన ప్రకారం ప్రతి 25 మంది సిబ్బందికి ఒక పర్యవేక్షకుడు అవసరం. దీనికి అనుగుణంగా 15 సూపర్‌వైజర్ పోస్టులను క్రియేట్ చేసేందుకు అనుమతి కోరుతూ టీటీడీ ఈవో ఇటీవల ప్రభుత్వానికి లేఖ సమర్పించారు. అంగీకారం తెలుపుతూ ప్రభుత్వ సెక్రటరీ వినయ్‌చంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



అలిపిరి పాదాలమండపం కిటకిట

వరుస సెలవులకు తోడు రెండవ శనివారం అలిపిరి పాదాల మండపం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పాదాల మండపం దర్శిస్తే శ్రీవారిని చూసినట్టేనని భక్తులు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో భారీగా భక్తులు పాదాలమండపం వద్దకు చేరుకున్నారు. పండితలిగ, దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను సందర్శించారు. ఇతర ప్రాంతాల వచ్చిన భక్తులు, స్థానికులు కలవడంతో కొబ్బరికాయల సమర్పణ ప్రాంతం కూడా కిక్కిరిసింది. దారిపొడవునా ఇరువైపులా ద్విచక్రవాహనాల పార్కింగ్ చాంతాడులా వ్యాపించింది. దీంతో గరుడ కూడలి వద్ద పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణలు మార్మోగింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



శ్రీహరి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.2.99 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,971

తలనీలాలు సమర్పించిన వారు: 24,439









చుట్టూ వనం.. ఎంచక్కా భోజనం

● అడవి సెట్టింగుల మధ్య అనుభూతుల విందు

కంగారు పడకండి..ఇదేంటి అడవిలో భోజనం చేస్తున్నారేంటనుకుంటున్నారా.. మీరే కాదు ఎవరైనా అలా భావించాల్సిందే. ఇక్కడకు వస్తే అచ్చం అడవిని తలపించే వాతావరణమే. కాలానుగుణ అభిరుచుల్లో ఇదొకటి. కొందరికి సరదాగా అటవీ ప్రాంతంలో భోజనం చేయాలనే కోరిక ఉంటుంది. అలాగని అడవికి పోలేం కదా..అందుకే అలాంటి వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆహారప్రియులకు ఆకట్టుకుంటోంది కపిలతీర్థం సమీపంలోని పై వైస్‌రాయ్ హోటల్. పచ్చని చెట్ల పందిరి, పక్షులు, జంతువుల రూపాల సెట్టింగుల మధ్య తింటుంటే అదే ఫీలింగ్ కలుగుతుంది. ఇందులోని గుహ రెస్టారెంట్‌లో



అడుగుపెట్టగానే గుహపై పెద్ద పులి నిద్రిస్తున్నట్లు కనిపిస్తుంది. రాజుల కాలం మాదిరిగా ఇద్దరు భటుల విగ్రహాలు ఆరంభంలోనే ఆకర్షిస్తాయి. లోపలకు వెళుతుంటే అడవిలో అడుగుపెడుతున్న అనుభూతి కలుగుతుంది. అటవీశాఖ యూనిఫారం తరహాలోనే సిబ్బంది దుస్తులు వేసుకుంటారు. ముత్యాల స్పెషల్ మటన్ బిరియాని, మటన్ ఫ్రై, మెంతాకు కోడి వేపుడు, టైగర్ చికెన్ ఇలా చికెన్‌లో వంద రకాలు, మటన్‌లో 50 రకాలు, ఫిష్‌లో 50, ప్రాన్స్‌లో 20 రకాల వంటకాలను ఆస్వాదించవచ్చు. శాఖాహారుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా భోజనం ఉంటుంది. పిల్లల కోసం ఓ ఆటల గది కూడా ఏర్పాటు చేశారు.

- తిరుపతి(వైద్యం)



సవిత - విజయభారతి - శోభారాజ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో రాష్ట్ర మంత్రి సవిత, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి, ప్రముఖ గాయని శోభారాజ్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పదవ తరగతి పరీక్షలకు కసరత్తు ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. మార్చి 17 నుంచి జరగనున్న ఈ పరీక్షలపై జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఫోకస్‌పెట్టారు. 310 ప్రభుత్వ పాఠశాలల నుంచి 15,455 మంది, 266 ప్రైవేటు పాఠశాలల నుంచి 11,548 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గతంలో ఫెయిలైన 634 మంది పరీక్షలు రాయనున్నారు. వీరందరి కోసం 164 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ఈ కేంద్రాల్లో పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టనుంది. 1,870 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు.రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖకు చెందిన అధికారులతో 8 ఫ్లయింగ్ స్క్వాడ్లను, 20 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 164 మంది చీఫ్ సూపరింటిండెంట్లను, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించనున్నారు.అన్ని కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



పకడ్బందీగా ఏర్పాట్లు

పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని కేంద్రాల్లో ప్రాథమిక వసతులు కల్పించనున్నాం. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

● రూ.25 లక్షల దుంగల స్వాధీనం

మంగళం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-కడప హైవేలోని కరకంబాడి సమీపంలోని నెలవాగు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డంప్ చేసి ఉంచి 26 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు తిరుపతి రేంజ్ అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద నిఘా వేసినట్లు చెప్పారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన నలుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. రఘు అనే వ్యక్తి పారిపోయాడని తెలిపారు. మోటార్ సైకిళ్లను, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో తిమ్మినాయుడుపాలెం సెక్షన్ ఎఫ్ఎస్‌వో రమేష్‌బాబు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వరరావు, కిషోర్‌కుమార్, సురేష్‌బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న అటవీ శాఖ అధికారులు

సూర్యఘర్ యోజక పథకాన్ని వినియోగించుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ కోరారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం పీఎం సూర్యాఘర్ యోజక పథకం అవగాహన మేళాను వారు ప్రారంభించారు. ఏడు కంపెనీల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించుకోవాలన్నారు. వేసవికాలంలో విద్యుత్ కొరతను తగ్గించడానికి ఇది దోహదపడుతుందని చెప్పారు. ఇలాంటి పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా విస్తరింపజేయాలన్నారు. ఈ పథకం లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అవగాహన మేళా ఆది, సోమవారాల్లో నిర్వహిస్తామని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు చెప్పారు. కార్యక్రమంలో సీజీఎంలు రమణాదేవి, వరకుమార్, ఏఎస్‌డీ మునిశంకరయ్య, ఈఈలు వి.చంద్రశేఖరరావు, పుల్లా బాలాజీ, వాసవీలత, సర్కిల్ ఎస్ఏవో శ్రీనివాసులు, డిఈఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

నత్తేనయం

● కొనసా..గుతున్న ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు

● ఐదేళ్లుగా భక్తులకు దూరమైన చరిత్ర సమూహం



తిరుమల ఎస్వీ మ్యూజియం

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రపంచం, జాతి సంస్కృతికి ఆనవాళ్లు, ఎన్ని తరాలవారికైనా కనిపించే చెక్కుచెదరని రూపాలు కొలువై ఉన్న ఎస్వీ మ్యూజియం భక్తులకు దూరమై ఐదేళ్లు గడుస్తోంది. అభివృద్ధి పేరుతో ఎస్వీ మ్యూజియాన్నే మర్చిపోయేలా చేశారు. పూర్వం మ్యూజియం శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో ఆర్ష సంస్కృతి సదస్సు పక్కనే ఉండేది. అంతేతే క్రమంగా సందర్శకులు పెరుగుతున్న క్రమంలో 1996లో నారాయణగిరి పర్వతం అనుకుని సువిశాలంగా శ్రీవేంకటేశ్వర మ్యూజియం పేరుతో రూ.3.5కోట్లతో నిర్మించారు. మొత్తం 7గ్యాలరీలు, ఒక మినీ థియేటర్‌ను రూపొందించారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచం, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ ఈ మ్యూజియం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేవి. ఇక, బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంతరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తోడరమల్లు, అచ్యుతదేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల ఫొటోలు కూడా ఉండేవి. ప్రత్యేకించి కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయ ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దం నాటి అలిపిరి వద్ద చెక్క మండపం, శ్రీకృష్ణలీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వారపాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు, వస్తువులు, శాసనాలు, రాగిరేకులు ఇలా చరిత్రకు సంబంధించి అనేక వస్తువులను ఎస్వీ మ్యూజియం ద్వారా భక్తులు తిలకించేవారు.

రూ.125 కోట్లతో ముందుకు వచ్చిన టాటా సంస్థ

తిరుమలోని ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించగా, అందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. ఆ పనులు నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. కొవిడ్ ఆంక్షలతో కొంతకాలం పనులు ఆగిపోతే, అధికారుల నిర్లక్ష్యంతో మరికొంతకాలం నత్తనడకన సాగినట్టు ఆరోపణలున్నాయి. గతేడాది బ్రహ్మోత్సవాల నాటికైనా ఆధునీకరణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి కారణం సరైన మ్యూజియం అధికారులు లేకపోవడమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతి

నారాయణవనం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన తులసి(50) తిరుమల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి వచ్చాడు. బహిర్భూమి నిమిత్తం మండల కాంప్లెక్స్ సముదాయం వద్ద బస్సు దిగాడు. సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని బావిలోకి దిగే క్రమంలో అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చనిపోయాడు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తులసి (ఫైల్ ఫొటో)

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

● ఇద్దరు డ్రైవర్ల అరెస్టు

రేణిగుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తండ్లం గ్రామ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు రోజువారీ తనిఖీలు చేపట్టారు. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తలిస్తుండటాన్ని గుర్తించి టిప్పర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే మండల పరిధిలోని తండ్లం, సూరప్పకశం పంచాయతీ పరిధిలో స్వర్ణముఖి నదిలో తీసిన ఇసుకను రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకుని రాత్రి సమయంలో ప్రైవేటు లారీల్లో తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని చెబుతూ తెల్ల టిప్పర్లతో బహిరంగంగా బిల్డర్లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



గాజులమండ్యం పోలీసుస్టేషన్‌కు తరలించిన టిప్పర్, ఎక్స్‌కవేటర్

త్వరలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

● ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళం డిపో పరిధిలోకి త్వరలో 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. దాదాపు రూ. 6కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం ప్రస్తుతం గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ పూర్తకాగా, సెకండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయ్యాక ప్రారంభ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లో ప్రారంభోత్సవం చేసేలా చూడాలన్నారు. అనంతరం అలిపిరి డిపోలో ఎలక్ట్రిక్ బస్సు ఛార్జింగ్ స్టేషన్‌ను, బస్సులను పరిశీలించారు. డీఎంతో సమీక్షిస్తూ ఇప్పటికే వంద ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాలో నడుస్తున్నాయన్నారు. త్వరలోనే 50ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతికి రానున్నాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డీపీటీవో నరసింహులను ఆదేశించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, డీఎంలు బాలాజీ, హరిబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

బీసీ హాస్టల్స్‌లో వందశాతం ఫలితాలు రావాలి

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో బీసీ వసతిగృహాల్లో వందశాతం ఫలితాలు రావాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సూచించారు. శనివారం తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి వసతిగృహాలను నిత్యం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. బీసీ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేసే నిధులతో పాటు సీఎస్ఆర్, ఎంపీ నిధులు సేకరించాలని ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుందని, ఈ లోపు బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని కులవృత్తుల వారికి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో చేనేత వస్త్రాల విక్రయాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. నేతన్నలకు 365 రోజులు పనులు కల్పించేలా వీవర్ శాలలు, చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జౌళి చేనేత శాఖ ఏడీ వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, బీసీ జిల్లా సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

మహా శివరాత్రి ఉత్సవాల కోసం రథాలకు మెరుగులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల కోసం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఊరేగనున్న రథాలకు అధికారులు మెరుగులు దిద్దే పనులు చేపట్టారు. ముక్కంటి ఆలయ భిక్షాల గాలిగోపురం సమీపంలో స్వామి అమ్మవార్ల రథాలు ఉన్నాయి. వీటికి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప రేకులను తొలగించారు. రథాల పటిష్ఠతను పరిష్కరించడంతో పాటు అవసరమైన మెరుగులు అద్దే పనులను ప్రారంభించారు.



పోలీస్ స్టేషన్లలో డీఎస్పీ తనిఖీలు



వాకాడు స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, చిట్టమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాకాడు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ గీతాకుమారి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, పాత కేసుల పురోగతి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలను నివారించేందుకు పగలు, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిట్టమూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

చిల్లకూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. శనివారం కలవకొండ క్రీడా మైదానంలో సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత స్నేహితులంతా కలిసి క్రికెట్ పోటీలు నిర్వహించడంతో పాటు అసోసియేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, ఏకాగ్రత్త పెరగడంతో పాటు యువకుల మధ్య స్నేహం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, నాగరాజు, మధు, రఘుబాబు, మోహన్, చిరంజీవి, త్రివిక్రమ్ భూపతి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

చిట్టమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు ప్రభుత్వాస్పత్రి అదనపు భవనానికి గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా భీష్మ ఏకాదశి మహోత్సవాలు



నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఉభయదారులు, భక్తులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మండపారాధన, గణపతిపూజ, గణపతి హోమం, రుద్రాభిషేకాలు, సాయంత్రం సామూహిక లలిత సహస్రనామార్చన కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభావతమ్మ, ఉగ్గుముడి భాస్కర్‌రెడ్డి, బాలాజీస్వామి, అవధానం సుధీర్, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గూడలిలో...

కోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు స్వర్ణముఖినదిలో స్నానాలుచేసి జనార్ధనస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



గూడూరు టవర్‌క్లాక్ కేంద్రం వద్ద బీజేపీ నాయకుల సంబరాలు

గూడూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ పట్టణా ధ్యక్షుడు దయాకర్ అన్నారు. శనివారం ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో స్థానిక టవర్‌క్లాక్ వద్ద నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, ప్రభాకర్, శ్రీనివాస్, శివ, మహేష్, బాలామని, నిరంజన్, పవన్‌కుమార్, మణికంఠ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలోని బీజేపీ మండల కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నాయి. స్వీట్లు పంచుకుని ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు తదితర ఎన్డీఏ కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు విశ్వనాథం వాసు ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్‌లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, మారం బాలాజీ, సురేష్, పరుశురాం, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వెకిలిగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

చిట్టమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇంట్లోకి ప్రవేశించి వెకిలి చేష్టలకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని ముక్కిడిపాళెం గ్రామానికి చెందిన చెంగయ్య నిత్యం మద్యం తాగి ఇళ్లల్లోకి దూరి వెకిలిగా ప్రవర్తించేవాడు. శనివారం ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెంగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదదని ఏడీఈ శేఖర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ వద్దనున్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 11నుంచి మధ్నాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

డక్కిలి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ జరుగుతుండగా టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వైసీపీకి చెందిన మాదిరెడ్డి రవి, మునికృష్ణా రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఉపాధి పనులకు రాని కూలీల పేరున మస్టర్లు వేసి కొంతమది మేట్లు నిధులు స్వాహ చేస్తున్నారని డక్కిలి గ్రామానికి చెందిన ఓ వర్గం ఇటీవల జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు ఈ సమయంలో వైసీపీకి చెందిన మాదిరెడ్డి రవి, మునికృష్ణా రెడ్డి తనపై దాడి చేశారని టీడీపీ కార్యకర్త పెంచల నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పులికాట్ తీరంలోని కారికాడు గ్రామ సమీపంలో పులికాట్ దిబ్బపై నిర్వహిస్తున్న కోడిపందేలా స్థావరంపై శుక్రవారం సాయంత్రం నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, ఒక కోడి పుంజు, రెండు మోటారు సైకిళ్లు, రూ.2400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





కోగిలి వేముగుంటపాళెం మార్గంలో కోతకు గురైన రోడ్డు - మెట్టు సమీపంలో గోతులమయంగా మారిన దారి

గ్రామీణ రోడ్లకు మోక్షం ఎప్పుడో?

- మరమ్మతులకు నోచుకోని దారులు
- అష్టకష్టాలు పడుతున్న ప్రజలు

చిట్టమూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు అభివృద్ధి నోచుకోకపోవడంతో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల దుస్థితి వర్ణనాతీతంగా ఉంది. అడుగుకో గుంతతో ఆదమరిస్తే ఆస్పత్రికే అన్న చందంగా వాహదారులకు, ప్రయాణికులకు ప్రాణ సంకటంలా మారింది. మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాలైన కోగిలి, ఎల్లూరు, వెలుగాజులపల్లి, బురదగాలి కొత్తపాళెం, బురదగాలి, కుమ్మరపాళెం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు పొడవునా గుంతలే దర్శనమిస్తున్నాయి. మెట్టు నుంచి గునపాడు, గునపాటిపాళెం మార్గ మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డు అస్తవ్యస్తంగా మారి ప్రయాణికులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కొత్తగుంట నుంచి వడ్డిపాళెం, ఆరూరు, అరవపాళెం, పెళ్లకూరు, తిమ్మారెడ్డివాగు గ్రామాలకు వెళ్లే రోడ్లు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన చిట్టమూరు కొత్తగుంట ప్రధాన రోడ్డుపై ప్రయాణం సర్కస్ ఫీట్లుగా మారింది. మల్లాం మార్గంలోని గెరండాల నుంచి రొయ్యల కాలువ మీదుగా మల్లాం వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రోడ్డు మార్జిన్‌ల వల్ల పలువురు వాహన చోదకుల మృత్యువాత పడగా, మరికొందరు గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ప్రభుత్వం స్పందించి గ్రామీణ రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కృష్ణమనాయుడు కండ్రిగ సమీపంలో కల్వర్టు వద్ద పూడ్చని గండి





గూడూరు ఆర్టీసీ బస్టాండు - రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్టీసీ తిరుమల బస్‌షెల్టర్ వద్ద ప్రైవేటు వాహనాలు

గూడూరు - తిరుమల బస్సులను పునరుద్ధరించండి

గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు గత కొంత కాలంగా బస్సు సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కలియుగ దైవం వెంకన్నను దర్శించుకునేందుకు దేశం నలమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చే భక్తులు గూడూరు జంక్షన్‌లో దిగి ఇక్కడి నుంచి తిరుమలకు వెళుతుంటారు. అయితే గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో భక్తులు ప్రైవేటు వాహనాల్లో అధిక ధరలు చెల్లించి తిరుమలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఆర్టీసీ గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు 15 బస్సు సర్వీసులను నడిపేది. ఇందుకోసం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇలా ఉండగా కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. కొవిడ్ ప్రభావం తగ్గిన తరువాత బస్సు సర్వీసులు తిరిగి పునరుద్ధరించలేదు. ప్రస్తుతం ఒక్క సర్వీసు మాత్రమే, అది కూడా తిరుపతి వరకు నడుపుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలే భక్తులకు దిక్కుగా మారాయి. ఇదే అదునుగా వాహనదారులు భక్తుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. శ్రీవారి భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తిరుమలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

బెంగళూరు సర్వీసునూ పునరుద్ధరించాలి

గూడూరు నుంచి బెంగళూరుకు గతంలో నడుపుతున్న ఒక బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో గూడూరు, సమీప ప్రాంతాలకు చెందిన ఎంతో మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని జాతీయ రహదారిపైకి చేరుకుని బైపాస్‌లో వెళ్లే వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒంగోలు, విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో ఖాళీ ఉంటేనే ఆపుతారని, లేకుంటే ఇబ్బందులు తప్పడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు కోర్టు సెంటర్ నుంచి బెంగళూరుకు బస్సు సర్వీసు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినితో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

కోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో వృద్ధుడు 7వ తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. శనివారం మద్యం తాగి వున్న వృద్ధుడు వీధిలో ఒంటరిగా వెళుతున్న విద్యార్థినిని పుచ్చకాయ ఇస్తానని ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవరించాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

12లోగా రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓజిలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శనివారం జనసేన నాయకులు పట్టణంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిని శిథిలావస్థకు చేరకుని ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వాలాయనందపురం, మాళవ్యానగర్, అశోక్‌నగర్, విఘ్నేశ్వరపురం ప్రాంతాల్లోని నీళ్ల ట్యాంకులు దుస్థితికి చేరుకున్నాయని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో మోహన్, సాయికిరణ్, సనత్, వంశీకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి శనివారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోట గ్రామానికి చెందిన వేలూరు రూపేష్‌కు రూ.5 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. రూపేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఇంతలో ఆరోగ్యం క్షీణించడంతో రూపేష్ మృతి చెందాడు. ఆయనకు కుమారుడు పవన్‌సాయికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం హోలిక్రాస్ కూడలిలో శనివారం లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో దొరవారిసత్రం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సురేష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంగళంపాడు ఆత్రేయ కాలనీ, ఉగ్గుముడి సచివాలయం, మతాకుముడికి వెళ్లేదారిలో చెరువు కట్ట వద్ద విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు

అల్లుకున్న నిర్లక్ష్యం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుని పొదలను తలపిస్తున్నాయి. ఉగ్గుముడి సచివాలయ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభాలకు,మతకాముడి వెళ్లే దారిలో చెరువు కట్ట వద్ద విద్యుత్ స్తంభాలకు, మంగళంపాడు ఆత్రేయ కాలనీ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుపోయాయి. దీని వల్ల తరచూ ఫీజులు కాలిపోయి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులే కాకుండా సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్‌లు ఉన్నా విద్యుత్ లైన్లు, సరఫరా ఇబ్బందుల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో చరిత్రకారుడు నశీర్‌ఆహ్మద్ సహకారంతో ఫ్రీడమ్ ఫైటర్స్ ఎక్స్‌పో కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఎంతోమంది మహనీయులు పోరాటాలు సాగించడంతో పాటు ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. అటువంటి మహనీయుల చిత్రపటాల ప్రదర్శనను ఏర్పాటు చేసి నేటి తరానికి వారి త్యాగాలను వివరించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ తరహా ప్రదర్శనల ద్వారా యువత, విద్యార్థుల్లో దేశభక్తి పెరగడంతో పాటు క్రమశిక్షణతో మెలుగుతారన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, రియాజ్‌ఆహ్మద్, అబ్దుల్ రహీం, జమాలుల్లా, కాలేషా, రషీద్, అన్వర్, యస్దానీ, ఇలియాజ్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, జహంగీర్, మగ్దూం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శనివారం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం వినతులు స్వీకరించారు. మొత్తం 20 అర్జీలు అందాయి. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు అలవల శ్రీనివాసులు, వాకచర్ల రమేష్, అత్తివరం గోపాల్ రెడ్డి, నాగేంధర్‌రెడ్డి, గురుకుల సుబ్రహ్మణ్యం, గురుకల తిరుమలరావు, సురేష్ నాయుడు, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కోట క్రాస్‌రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేస్తున్న పోలీసులు

కోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని గూడూరు డీఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. శనివారం కోట క్రాస్ రోడ్డులో చల్లకాలువ సమీపంలోని బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పోలీసులు, స్థానికుల ఆధ్వర్యంలో తొలగించారు. పరిసరాల శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అనర్థాలను వివరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్‌ఐ పవన్‌కుమార్, ఏఎస్‌ఐ శోభారాణి, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వరుస చోరీలపై ఎస్పీ సీరియస్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వరుస చోరీ ఘటలను జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. దొంగల ముఠాలు గుర్తింపునకు క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ బృందాలు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రత్యేకంగా నిఘా పెట్టారు. చంద్రగిరి మండలంలోని ముంగిలిపట్టు కేసు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో తిరుపతిలోని సీపీఆర్ అపార్టుమెంటులో మాత్రం ఉత్తరప్రదేశ్ ముఠానే చోరీకి పాల్పడిందనే నిర్ధయానికి వచ్చారు. క్రైం పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పాత నేరస్తుల వేలిముద్రలు, కనుబొమ్మలు లాంటివి పరిశీలిస్తున్నారు. డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులను దర్యాప్తు కోసం నియమించారు.